విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

ప్రశ్నించడం అందరి హక్కు...

పెన్ సత్తా

PEN SATTA Telugu Daily

సంపుటి : 4 | సంచిక :163 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శుక్రవారం 30 అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

పరిశ్రమలకు భారీ ప్రోత్సాహకాలు

- మంత్రివర్గం కీలక నిర్ణయాలు
- 48 అజెండా అంశాలకు ఆమోదం
- అమరావతి నిర్మాణానికి రూ.1,925 కోట్ల పనులు
- డేటా సెంటర్, సెమీకండక్టర్ ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్
- భారీ పెట్టుబడులకు భూకేటాయింపులు
- క్వాంటమ్ వ్యాలీలో హార్డ్‌వేర్ తయారీ పార్కు
- సాగునీటి ప్రాజెక్టులకు రూ.698.90 కోట్లు
- బయోగ్యాస్, పవన విద్యుత్ ప్రాజెక్టులకు ఊతం
- రక్షణ పరిశ్రమల మౌలిక సదుపాయాలకు ఆమోదం
- పర్యాటక రంగంలో పెట్టుబడులకు ప్రోత్సాహకాలు

అమరావతి

పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్, పరిశ్రమలకు ఫుల్ జోష్ అమరావతి నిర్మాణానికి మరింత ఊపు, రాష్ట్ర అభివృద్ధికి ఊతం ఇచ్చేలా రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. భారీ పారిశ్రామిక ప్రాజెక్టుల నుంచి సెమీకండక్టర్ తయారీ వరకు సాగునీటి పనుల నుంచి స్వచ్ఛ ఇంధనం వరకు పలు రంగాలకు సంబంధించిన ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపింది. భూకేటాయింపులు, పెట్టుబడుల ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాల విస్తరణతో రాష్ట్రంలో పారిశ్రామిక, ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చే నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన వర్చువల్‌గా జరిగిన మంత్రివర్గ సమావేశంలో 48 అజెండా అంశాలకు ఆమోదం తెలిపింది. ఈ భేటీలో రాజధాని నిర్మాణానికి

వివరాలు 2లో..

పోలీసుల లాఠీలకు భయపడొద్దు

- నవంబర్1న ర్యాలీకి తరలిరండి
- ప్రజలకు రాహుల్ గాంధీ పిలుపు
- ఇండీ కూటమి నవంబర్ 1న తలపెట్టిన చలో ఢిల్లీ ర్యాలీలో ప్రతిఒక్కరూ పాల్గొనాలి
- తమ కుతంత్రాలను ప్రయోగించే దమ్ము బీజేపీకి లేదు
- దేశాన్ని కాపాడుకోవడానికి కలిసికట్టుగా నడుద్దాం

తుపాను బాధితులకు అండగా నిలవండి

- పార్టీ శ్రేణులకు జగన్ పిలుపు
- ప్రభుత్వ సహాయక చర్యలు పూర్తిగా విఫలమయ్యాయని జగన్ విమర్శ
- టీడీపీ నేతలు బియ్యం మాఫియాను ప్రోత్సహిస్తున్నారని ఆరోపణ
- సోనా మసూరి బియ్యం ధర కేజీ రూ.90 దాటిందని వ్యాఖ్య

అమరావతి

అర్నబ్ తుపాను బాధిత ప్రాంతాల్లో ప్రజలకు అండగా నిలవాలని వైసీపీ అధినేత జగన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సహాయక చర్యలు విఫలమయ్యాయని విమర్శించారు. అధికార పార్టీ నేతలు 'బియ్యం మాఫియా'ను ప్రోత్సహిస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి జిల్లా అధ్యక్షులు, రీజనల్ కో-ఆర్డినేటర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

వివరాలు 2లో..

డిజిటల్ మోసాలకు బ్యాంకులే నష్టపరిహారం చెల్లించేలా జవాబుదారీగా చేయాలి

- బ్యాంకులే నష్టపరిహారం చెల్లించాలి
- అసాధారణ లావాదేవీలపై నిఘా
- తగ్గిన డిజిటల్ అరెస్ట్ కేసులు
- విద్యావంతులూ మోసపోతున్నారు
- డిజిటల్ అరెస్టులపై సీజేఐ ఆగ్రహం

మహువా మొయిత్రా పిటిషన్ కొట్టివేత

- సెబీకి ఆదేశాలు ఇవ్వలేమన్న సుప్రీం
- కొత్త నియంత్రణ విధానం సృష్టించలేం
- పెట్టుబడిదారుల వివరాలపై వాదనలు
- పారదర్శకతపై పిటిషనర్ ఆందోళన

ఎరుపెక్కిన ఆకాశం..

- ఛత్తీస్‌గఢ్‌లో పలుచోట్ల రక్తవర్ణంలోకి మారిన ఆకాశం
- అర్నబ్ తుపాను ప్రభావంతోనే ఈ పరిస్థితి అని నిపుణుల అంచనా
- 'స్ట్రేంజర్ థింగ్స్' సిరీస్‌తో పోలుస్తూ నెటిజన్ల వైరల్ పోస్టులు
- ఇనుము అధికంగా ఉండే ధూళి కణాలే దీనికి కారణమని వెల్లడి
- ఏపీ తీరాన్ని తాకిన అర్నబ్ తుపాను తీవ్ర నష్టాన్ని మిగిల్చిన వైనం

మార్చి నాటికి భారత్‌లో ఎండలతో 55 వేల మరణాల ముప్పు?

- ఎల్‌నినోపై కొత్త అంచనా!
- మార్చిలోనే ఎక్కువ మరణాలు సంభవించే అవకాశం ఉందని వెల్లడి
- ప్రపంచవ్యాప్తంగా 3.73 లక్షల మరణాల అంచనా
- నైజీరియాలో 56 వేల మరణాల ప్రమాదం ఉందన్న క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్
- ఎల్‌నినో ప్రభావం 2027 ప్రారంభం వరకు కొనసాగే అవకాశం

ఉత్తరాంధ్ర జిల్లాలను అతలాకుతలం చేసిన అర్నబ్ తుపాను

- జలదిగ్బంధంలో పలు గ్రామాలు
- అర్నబ్ తుపాను ఉత్తరాంధ్ర జిల్లాలను అతలాకుతలం
- శ్రీకాకుళం, అల్లూరి జిల్లాల్లో తీవ్ర నష్టాన్ని మిగిల్చింది
- నాగావళి, వంశధార ఉప్పొంగడంతో శ్రీకాకుళం జిల్లాలో అనేక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి

భయం వద్దు.. ఆదుకుంటాం!

- తుపాన్ బాధితులకు సీఎం చంద్రబాబు భరోసా
- ప్రాథమిక అంచనా ప్రకారం రూ.4,600 కోట్ల నష్టం
- కొబ్బరి, ఆయిల్‌పామ్ చెట్టుకు రూ.1,500 పరిహారం
- బాధిత కుటుంబాలకు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు
- విద్యుత్ పునరుద్ధరణకు అదనపు సిబ్బంది
- నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ముఖ్యమంత్రి

అమరావతి:

అర్నబ్ తుపాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. తుపాన్ కారణంగా ప్రాథమిక అంచనా ప్రకారం రాష్ట్రంలో సుమారు రూ.4,600 కోట్ల నష్టం వాటిల్లినట్లు వెల్లడించారు. బాధితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నష్టాన్ని అంచనా వేసి సహాయక చర్యలను

వివరాలు 2లో..

రబీ సాగుపై ఎల్‌నినో పంజా

- దేశవ్యాప్తంగా 59 శాతం పడిపోయిన గోధుమల సాగు
- ఆందోళనలో రైతులు!
- ఎల్‌నినో ఎఫెక్ట్ రబీ పంటల సాగుపైనా పడింది
- దేశంలో ఈ రబీ పంటల సాగు విస్తీర్ణం 28.26 లక్షల హెక్టార్ల నుంచి 18.02 లక్షల హెక్టార్లకు తగ్గింది

బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం

- అర్నబ్ తుపాను ప్రభావం నుంచి కోలుకోకముందే మరో ముప్పు
- దక్షిణ అండమాన్ సముద్రంలో కొత్త అల్పపీడనం
- రానున్న 48 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం
- నవంబర్ 2, 3 తేదీల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రలో భారీ వర్షాలు
- కొత్త హెచ్చరికతో రైతులు, తీరప్రాంత ప్రజల్లో ఆందోళన

పరిశ్రమలకు భారీ ప్రోత్సాహకాలు

-మొదటిపేజీ తరువాయి

సంబంధించిన ప్రతిపాదనలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అమరావతి ప్రభుత్వ సముదాయంలోని జీఏడీ టవర్‌లో విద్యుత్, శీతలీకరణ, అగ్నిమాపక భద్రత, లిఫ్టులు, ఫైర్ అలారాలు, పబ్లిక్ అడ్రస్ వ్యవస్థ, ప్లంబింగ్ తదితర హైసైడ్ మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులకు రూ. 448.31 కోట్ల టెండర్‌కు ఆమోదం తెలిపారు. టవర్లు 1, 2లో ఇదే తరహా పనులకు రూ. 768.89 కోట్లు, టవర్లు 3, 4లో పనులకు రూ. 708.12 కోట్ల కాంట్రాక్టు ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేశారు. మూడు పనుల మొత్తం కాంట్రాక్టు విలువ దాదాపు 19వందల 25.33 కోట్లు. పన్నులు, సుంకాలు అదనం. అత్యల్ప టెండర్‌దారుల బిడ్లను ఆమోదించి పనులు అప్పగించేందుకు ఏజీఐసీఎల్? మేనేజింగ్ డైరెక్టర్‌కు అధికారం కల్పించే ప్రతిపాదనకు ఆమోదం లభించింది.

పారిశ్రామిక అభివృద్ధి విధానం 4.0:

డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా విశాఖ పట్నం జిల్లా అడవివరం, ముడసర్లోవ ప్రాంతాల్లో జీవీఎంసీకి చెందిన 5.84 ఎకరాల భూమిని విజాగ్ హైపర్‌స్కేల్ డేటా సెంటర్ పార్క్ లిమిటెడ్‌కు లీజుకు ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. అదానీ ఇన్‌ఫ్రా ఇండియా అనుబంధ సంస్థ అయిన ఈ కంపెనీకి ప్రత్యేక రాయితీలు కల్పించారు. విజయనగరం జిల్లా శ్రీరాంపురంలో స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ కు 5 వేల194 కోట్ల పెట్టుబడితో ఏడాదికి పది లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంటు ఏర్పాటు, మూడు వేల మందికి ఉపాధి కల్పించే ప్రాజెక్టుకు రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి విధానం 4.0 కింద ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. రెనైసాన్స్ సోలార్ అండ్ ఎలక్ట్రానిక్ మెటీరియల్స్ సంస్థకు 91.10 ఎకరాలు కేటాయించి, 3 వేల 700 కోట్ల పెట్టుబడితో 5 గిగావాట్ల సామర్థ్యం కలిగిన సమీకృత సిలికాన్ క్రిస్టల్, వేఫర్ తయారీ కేంద్రం ఏర్పాటు ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది.

రామ్‌కో సిమెంట్స్ వాణిజ్య ఉత్పత్తి ప్రారంభ గడువు సవరణ, అదనపు ప్రోత్సాహకాలు, తొమ్మిది సంస్థలకు ఎర్లీ బర్డ్ ఇన్సెంటివ్ పథకం కింద మూలధన రాయితీల మంజూరు వంటి ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదం లభించింది. శ్రీ సిమెంట్‌కు వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు మండలం ఎస్.ఉప్పలపాడులో 452 ఎకరాలు, జై రాజ్ ఇస్పాత్‌కు కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం గుట్టపాడులో 418.55 ఎకరాలు కేటాయించే ప్రతిపాదనలకూ ఒకే చెప్పారు. పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా వివిధ పరిశ్రమలకు భూకేటాయింపులకు ఆమోదం తెలిపారు. నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం అల్లంపాడులో సన్‌షైన్ ఎనర్జిటిక్స్‌కు 455.91 ఎకరాలు, మునీష్ డిఫెన్స్ సొల్యూషన్స్‌కు దుత్తలూరు ప్రాంతంలో 250 ఎకరాలు, ఆదిత్య ప్రెసిటెక్‌కు 300 ఎకరాలు, జాక్సన్ సోలార్ ఇంటిగ్రేటెడ్‌కు కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం మీడివేములలో 290 ఎకరాలు ఇందులో ఉన్నాయి.

ఏపీఐఐసీకి బదిలీ ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్

కర్నూలు జిల్లా ఓర్వకల్లులో రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ ప్యాకేజ్డ్ శీతల పానీయాలు, జ్యూస్‌లు, ప్యాకేజ్డ్ తాగునీటి తయారీ కేంద్రం ఏర్పాటు కోసం రూ.2,606 కోట్ల సవరించిన పెట్టుబడి ప్రతిపాదనకు ఆమోదం లభించిశీది. రక్షణ పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఏపీఐఐసీ ఆధ్వర్యంలో సామగ్రి, క్లస్టర్ భూముల కేటాయింపు నిబంధనలకు ఆమోదం దక్కింది. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రిలో 713.04 ఎకరాల ప్రభుత్వ భూమిని మార్కెట్ విలువ ఆధారంగా ఏపీఐఐసీకి బదిలీ చేసే ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల రంగాల విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలకూ మంత్రివర్గం ఆమోదం లభించింది. అమరావతి క్వాంటమ్ వ్యాలీ పరిధిలో సుమారు 250 ఎకరాల్లో క్వాంటమ్ హార్డ్‌వేర్ తయారీ పార్కు ఏర్పాటు, అవసరమైన బడ్జెట్ సహకారం అందించే ప్రతిపాదనకు కూడా ఆమోదం లభించిశీది. వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రతిపాదనల్లో కృష్ణా జిల్లాలోని మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందించే కోటపాడు లిఫ్ట్, చనుబండ, విస్సన్నపేట లిఫ్ట్ పథకాల పనుల కొనసాగింపునకు రూ.698.90 కోట్ల ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. అనంతపురం జిల్లాలోని ఉరవకొండ నియోజకవర్గంలో కమ్యూనిటీ లిఫ్ట్ కమ్ డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల కొనసాగింపునకు కూడా ఆమోదం లభించిశీది. విద్యుత్ ఉత్పత్తి సంస్థల ఆర్థిక అవసరాలకు సంబంధించిన ప్రతిపాదనలకూ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాయలసీమ స్టీల్ సంస్థకు 2029 అక్టోబరు వరకు తాత్కాలిక, చార్జీ విధానంలో ఏటా 0.025 టీఎంసీల నీటిని కేటాయించే ప్రతిపాదనకు కూడా ఆమోదం దక్కింది. రోజుకు గరిష్ఠంగా 2,000 ఘనపు మీటర్ల నీటి అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు.

మరో బయోగ్యాస్ ప్లాంటు:

రాష్ట్ర సమగ్ర స్వచ్ఛ ఇంధన విధానం-2024 కింద బయోగ్యాస్, పవన విద్యుత్, పవన-సౌర హైబ్రిడ్ ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు కల్పించే ప్రతిపాదనలకు క్యాబినెట్ లో ఆమోదం తెలిపారు. చిత్తూరు జిల్లా విజయపురం మండలం కలియంబాక్కంలో ఐరా బయోఎనర్జీ రోజుకు 12 టన్నుల సామర్థ్యంతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటు చేయనుంది. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం తాడువాయిలో ఆంధ్రా షుగర్స్ రోజుకు పది టన్నుల సామర్థ్యంతో మరో బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటు చేయనుంది. ఈ రెండు ప్రాజెక్టులకు విధానం ప్రకారం ప్రోత్సాహకాలు కల్పించే ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కడివెల్లి, సమీప గ్రామాల్లో విండోరా ఎనర్జీకి 500 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు కేటాయింపునకు ఆమోదం తెలిపారు. వివిధ జిల్లాల్లో పారిశ్రామిక పార్కులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వ భూములను ఏపీఐఐసీకి బదిలీ చేసే ప్రతిపాదనలకు ఆమోదం లభించిశీది. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం సోమరాజుపల్లిలో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కొండపి నియోజకవర్గంలోని మత్స్యకార బాలికల కోసం శాశ్వత పాఠశాల భవనం, వసతి గృహం నిర్మించేందుకు ఉచితంగా కేటాయించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. పర్యాటక, ఆతిథ్య రంగాల్లో పెట్టుబడులకు సంబంధించిన ప్రతిపాదనలకూ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కాకినాడలో లాలా ల్యాండ్ వాటర్ అండ్ అమ్యూజ్‌మెంట్ పార్కు అభివృద్ధికి మాన్ ప్రకృతి గ్రూప్స్‌కు ప్రోత్సాహకాలు కల్పించాలన్న రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సిఫారసులకు ఆమోదం లభించిశీది. అనంతపురంలో రాయల్ ఆర్కిడ్స్ బ్రాండ్ కింద ఫోర్‌స్టార్ హోటల్ ఏర్పాటు కోసం స్కై రిట్రీట్స్ సంస్థకు ప్రోత్సాహకాలు అందించే ప్రతిపాదనకూ ఆమోదం దక్కింది. 2026--27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో ధాన్యం సేకరణ కార్యకలాపాలకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఆమోదించే అంశానికి మంత్రివర్గం ఆమోదం లభించింది. నీతి ఆయోగ్ 11వ పాలక మండలి సమావేశంలోని కార్యాచరణ నివేదికను మంత్రివర్గం పరిశీలించింది. అర్నబ్ తుపానుకు సంబంధించిన పరిస్థితులపై రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ రూపొందించిన నివేదికనూ సమావేశంలో చర్చించారు.

భయం వద్దు.. ఆదుకుంటాం!

-మొదటిపేజీ తరువాయి

వేగవంతం చేస్తామని తెలిపారు. గురువారం తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఆయన.. దెబ్బతిన్న పంటలు, విద్యుత్ వ్యవస్థ, నివాస ప్రాంతాలను పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఏరియల్ సర్వే అనంతరం క్షేత్రస్థాయిలో పర్యటన

మొదట ఏరియల్ వ్యూ ద్వారా తుపాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన ముఖ్యమంత్రి, అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని కాట్రేనికోన మండలానికి చేరుకున్నారు. చెయ్యేరు, వేట్లపాలెం, గచ్చకాయలపొర గ్రామాల్లో పర్యటించి తుపాన్ కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. పంటలు నష్టపోయిన రైతులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజల అవసరాలు, వారికి అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం ముమ్మిడివరం నియోజకవర్గంలోని గచ్చకాయలపొర గ్రామంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, జరిగిన నష్టం గురించి వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని పేర్కొన్నారు. అందుకే నేరుగా ప్రభావిత ప్రాంతాలకు వచ్చి పరిస్థితిని పరిశీలించినట్లు తెలిపారు.

చెట్టుకు రూ.1,500 పరిహారం

తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులకు సహాయం అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. దెబ్బతిన్న ఒక్కో కొబ్బరిచెట్టుకు రూ.1,500, ఆయిల్‌పామ్ చెట్టుకు కూడా రూ.1,500 చొప్పున పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంటలు, తోటలు, ఇతర ఆస్తులకు జరిగిన నష్టాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనా వేయాలని సూచించారు. నష్టపోయిన రైతులకు సహాయం అందించే ప్రక్రియలో జాప్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయంపై ఆధారపడి జీవించే కుటుంబాలకు తగిన భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు.

బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులు

పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన కుటుంబాలు తిరిగి తమ ఇళ్లకు వెళ్లే సమయంలో సహాయం అందిస్తామని చంద్రబాబు తెలిపారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకుల ప్యాకెట్‌తో పాటు ఖర్చుల కోసం నగదు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తుపాన్ కారణంగా ఇళ్లు, నివాస ప్రాంతాలు దెబ్బతిన్నవారికి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలు సాధారణ జీవనానికి తిరిగి చేరుకునే వరకు సహాయక చర్యలు కొనసాగించాలని స్పష్టం చేశారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, ఇతర అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికార యంత్రాంగానికి సూచించారు.

విద్యుత్ పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు

కోనసీమ జిల్లాలో తుపాన్ కారణంగా సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను తిరిగి ఏర్పాటు చేసి, వీలైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ సిబ్బంది నిరంతరం పనిచేస్తూ పరిస్థితిని చక్కదిద్దాలని సూచించారు. పునరుద్ధరణ పనులకు అదనపు సిబ్బంది అవసరమవడంతో తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి వెయ్యి మంది సిబ్బందిని పంపాలని కోరినట్లు తెలిపారు. అవసరమైతే కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా సిబ్బందిని రప్పిస్తామని వెల్లడించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడకుండా పునరుద్ధరణ పనులను ప్రాధాన్య క్రమంలో చేపట్టాలని అధికారులకు సూచించారు.

దెబ్బతిన్న నివాసాల పునరుద్ధరణకు ఆదేశాలు

తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న పాకలు, నివాసాలను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇళ్లు దెబ్బతిని ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలన్నారు. ప్రజలకు తక్షణ ఉపశమనం కలిగించే పనులను ముందుగా చేపట్టి, అనంతరం ఇతర పునరుద్ధరణ కార్యక్రమాలను పూర్తి చేయాలని సూచించారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి సూచన

పర్యటన సందర్భంగా పలువురు మత్స్యకారులు తమ పడవల రిజిస్ట్రేషన్ లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, సమస్యను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. తుపాన్ కారణంగా ఉపాధి కోల్పోయిన మత్స్యకారుల సమస్యలను కూడా పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఏడుగురి మృతి.. సహాయక చర్యలపై దృష్టి

తుపాన్ సమయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ దురదృష్టవశాత్తూ ఏడుగురు ప్రాణాలు కోల్పోయారని చంద్రబాబు తెలిపారు. ఇలాంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటం, నష్టాన్ని తగ్గించడం ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. తుపాన్లు రావడం లేదని, ప్రభుత్వం అతిగా జాగ్రత్తలు తీసుకుంటోందని విమర్శించే విషయాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని అధికారులకు సూచించారు. ప్రజల రక్షణ, సహాయక చర్యలపైనే దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు.

కేంద్ర బృందాల పర్యటన

తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర బృందాలు శుక్రవారం పర్యటించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. కేంద్ర బృందాలు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి నష్టాన్ని అంచనా వేయనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా నష్టం వివరాలను సేకరించి అవసరమైన నివేదికలను సిద్ధం చేస్తోందని వెల్లడించారు. తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులు, మత్స్యకారులు, ఇతర బాధిత కుటుంబాలకు సహాయం అందించడంతో పాటు విద్యుత్ సరఫరా, నివాసాలు, మౌలిక సదుపాయాల పునరుద్ధరణను వేగవంతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చంద్రబాబు తెలిపారు.

టీడీపీ కంటే వైసీపీ ఎక్కువ నామినేషన్లు

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వడం లేదంటూ వైఎస్సార్‌సీపీ చేస్తున్న దుష్ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని ఎన్నికల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అధికార కూటమి అడ్డంకులు సృష్టిస్తోందని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని గగ్గోలు పెడుతున్న జగన్ నాటకాలను అధికారిక లెక్కలే బట్టబయలు చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా దాఖలైన నామినేషన్ల సంఖ్యను పరిశీలిస్తే, ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఏ స్థాయిలో పోటీలో ఉన్నారో, కొన్నిచోట్ల కూటమి కంటే ఎక్కువ సంఖ్యలోనే నామినేషన్లు వేసి హోరాహోరీగా రేసులో నిలిచారో స్పష్టమవుతోంది.రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 9,829 ఎంపీటీసీ స్థానాలకు గానూ మొత్తం 32,095 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకంగా 12,419 నామినేషన్లు వేయగా, తెలుగుదేశం పార్టీ తరఫున 15,017 మంది నామినేషన్లు సమర్పించారు. జనసేన నుంచి 2,073, బీజేపీ నుంచి 562 నామినేషన్లు వచ్చాయి. ఇక జెడ్పీటీసీల విషయానికొస్తే.. 659 స్థానాలకు మొత్తం 2,805 నామినేషన్లు పడగా, వైఎస్సార్‌సీపీ నుంచి అత్యధికంగా 1,092 మంది పోటీలో నిలిచారు. అధికార టీడీపీ తరఫున 1,055 మంది మాత్రమే నామినేషన్లు వేయగా, జనసేన నుంచి 178, బీజేపీ నుంచి 111 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రధాన స్థానాల్లో టీడీపీ కంటే వైఎస్సార్‌సీపీ నేతలే ఎక్కువ నామినేషన్లు దాఖలు చేయడం వారి ఫేక్ ప్రచారాన్ని బట్టబయలు చేసింది.తమ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అక్రమాలను, దౌర్జన్యాలను గుర్తుచేసుకుంటూ ఇప్పుడు అధికార కూటమిపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2020లో జరిగిన పట్టణ, గ్రామీణ స్థానిక పోరులో వైఎస్సార్‌సీపీ బలవంతపు ఏకగ్రీవాలతో రికార్డు సృష్టించింది. నాడు పట్టణ ప్రాంతాల్లో 20.72 శాతం స్థానాలను ఏకగ్రీవం చేసుకోగా, గ్రామీణ ప్రాంతాల్లో 24 శాతం ఎంపీటీసీలు, 19 శాతం జెడ్పీటీసీలను ప్రతిపక్షాలను బెదిరించి, భయాందోళనలకు గురిచేసి బలవంతంగా చేజిక్కించుకున్నారు. నాడు జరిగిన విధ్వంసాలు, దాడులతో గొడవలు సృష్టించి సాధించిన ఏకగ్రీవాలనే తమ గొప్ప విజయాలుగా వైఎస్సార్‌సీపీ ప్రచారం చేసుకుంది.కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మాత్రం ఎన్నికలు అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్నాయి. ప్రతిపక్ష అభ్యర్థులకు పూర్తి స్వేచ్ఛ ఉండటం వల్లే భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు కావడం సాధ్యమైంది. వైఎస్సార్‌సీపీ నేతలు ఉద్దేశపూర్వకంగానే కెమెరాల ముందు నాటకాలు ఆడుతూ, ఫేక్ వీడియోలతో నేషనల్ మీడియాను, ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారనేది ఈ అధికారిక గణాంకాలతో స్పష్టంగా నిరూపణైంది. ప్రజా క్షేత్రంలో ఎదుర్కొనే ధైర్యం లేకనే జగన్ వర్గం ఇటువంటి అసత్య ప్రచారాలను నమ్ముకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఉత్తరాంధ్ర జిల్లాలను అతలాకుతలం చేసిన అర్నబ్ తుపాను

అర్నబ్ తుపాను ఉత్తరాంధ్ర జిల్లాలను అతలాకుతలం చేసింది. శ్రీకాకుళం, అల్లూరి జిల్లాలో తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. నాగావళి, వంశధార ఉప్పొంగడంతో శ్రీకాకుళం జిల్లాలో అనేక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వందలాది ఎకరాలు నీటమునిగాయి. చేతికందిన పంట నీటిపాలైంది. అల్లూరి జిల్లాలో రోడ్లు దెబ్బతినడంతో ప్రముఖ పర్యాటక ప్రాంతాలు మూతపడ్డాయి. శ్రీకాకుళం జిల్లాలో అర్నబ్ జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు టెక్కలి తహసీల్దార్ కార్యాలయం, సబ్ రిజిస్టార్ కార్యాలయం జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. సబ్ రిజిస్టర్ కార్యాలయ రికార్డ్ రూం, స్టోర్ రూంలోకి నీరు చేరింది. పెద్దసాన మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల రక్షణ గోడపై భారీ చెట్టు కూలింది. పలాస మండలం కంబిరిగాం, బ్రాహ్మణ తర్లా వద్ద కాజ్‌వేలపై నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. మందస మండలం కుదుమసాయి, డబార్సింగి, గోపాల్ సాయి గ్రామాలకు రాకపోకలు ఇబ్బంది కలుగుతోంది. మకరజోల, కుంటికోట, అచ్యుతాపురం ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి. వజ్రపు కొత్తూరు మండలం పూండి రైల్వే అండర్ పాసేజ్ నీటమునిగి రాకపోకలు ఆగిపోయాయి.

వరి పంట నేలమట్టం

పెద్దరోకళ్లపల్లి మార్గంలో కాజ్ వేపై వరద నీటి ప్రభావంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆమదలవలస నియోజకవర్గంలో వర్షం నీరు ఉధృతంగా ప్రవహించడంతో పంట పొలాలు నీట మునిగాయి. చెట్లు విరిగిపడి విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. వంశధార ఉధ్ధృతికి సరుబుజ్జిల మండలం పురుషోత్తపురం, అవధానాల చెరువు పొంగి పొర్లి దిగువన ఉన్న చవ్వాకులపేట, ఆనందపురం పొన్నంపేట, రామచంద్రపురంలో పంట పొలాలు చెరువుల్లా మారాయి. నాగావళి ఉధ్ధృతికి చీమలవలస, కొత్తవలస, తమ్మయ్యపేట,కనుగులవలస, కొర్లకోట, తురకపేట, నెల్లిపర్తి ప్రాంతాల్లో వరి పంట నేలమట్టమైంది. రొట్టవలస, సవలాపురం, సుబ్బపేట, యరగాం, బొప్పడం, సరుబుజ్జిలి, నందికొండ, బూర్జ మండలంలో లక్కుపురం, అల్లేనా, భగీరథపురం, గువ్వపేట గ్రామాల్లో స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పొందూరు మండలంలో రెల్లిగడ్డ ఉధృతి వల్ల గోరింటా, తాడివాడ గ్రామాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. ఇచ్ఛాపురంలో బహుద నది ఉగ్రరూపం దాల్చింది. జాతీయ రహదారిపై వరద పారుతుండంతో రాకపోకలు నిలిచిపోయాయి. బహుదా పరివాహకంలోని ఈనెసుపేట, లొద్దపుట్టి, పెటూరు, జగన్నాధపురం, రాత్తకన్నా గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఎన్?డీఆర్?ఎఫ్? బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నాయి. కొత్తూరు మండలం పెనుగోటువాడ, మాతల గ్రామాలను వంశధార చుట్టుముట్టింది. ఆ గ్రామాల ప్రజలు బయటకు రావద్దని అధికారులు హెచ్చరిక జారీ చేశారు.

అర్నబ్ తుపాను ప్రభావంతో విశాఖపట్నం జిల్లాలో విద్యుత్ వ్యవస్థకు నష్టం వాటిల్లింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, లైన్లు, ఫీడర్లు దెబ్బతిన్నాయి. జిల్లాలో మూడు 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, 37 ఫీడర్లు దెబ్బతినగా అన్నింటినీ పునరుద్ధరించారు. 11 కేవీ విద్యుత్ వ్యవస్థపై తుపాను ప్రభావం ఎక్కువగా కనిపించింది. జిల్లాలో 234 ఫీడర్లు దెబ్బతినగా అన్నింటిని బాగు చేశారు. జిల్లాలో 79 గ్రామాల్లో విద్యుత్ వ్యవస్థ ప్రభావితం కాగా, 78 గ్రామాల్లో సరఫరాను పునరుద్ధరించారు. అర్నబ్ తుపాను ప్రభావంతో విశాఖ జిల్లాలో రిజర్వాయర్లు జలకల సంతరించుకున్నాయి. మేఘాద్రి గడ్డ, ముడసర్లోవ రిజర్వాయర్లు గరిష్ట స్థాయికి చేరాయి.

జలాశయాలకు పోటెత్తిన వరద

అర్నబ్ తుఫాన్ అనకాపల్లి జిల్లా రైతుల నడ్డి విరిచింది. వేలాది ఎకరాలలో పంట నష్టం జరిగింది. ఇప్పటివరకు 7వేల హెక్టాలకు పైగానే పంట నీటి మునిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. మాడుగుల నియోజకవర్గంలో తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంత గెడ్డల నుంచి జలాశయాలకు వరద పోటెత్తింది. చీడికాడ మండలం కోనాం జలాశయంలో నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరడంతో నీటిని విడుదల చేశారు. పెద్దేరు జలాశయం నుంచి నీటిని దిగువకు విడిచిపెట్టారు. రైవాడ జలాశయంలో నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో తుపాను ధాటికి రోడ్లు దెబ్బతిన్నాయి. అరకు నియోజకవర్గం పిరిబంధ గ్రామానికి వెళ్లే రోడ్డు కోతకు గురైంది. కరకవలస సమీపంలో కొండ చరియలు పడి కేటికి జలపాతానికి వెళ్లే మార్గం మూసుకుపోయింది. అనంతగిరి, డుంబ్రిగూడ, పెదబయలు మండలాల్లోనూ రోడ్లు దెబ్బతిన్నాయి. నిర్మాణ దశలో ఉన్న రహదారులు కొట్టుకుపోయాయి. అరకు-విశాఖ ఘాట్‌రోడ్ ప్రమాదకరంగా మారింది. గాలికొండ సమీపంలో రోడ్డు జారిపోయింది. అరకు మీదుగా విశాఖ వెళ్లే రహదారిని మూసివేశారు. అరకు-నుంచి విశాఖ వెళ్లాలంటే పాడేరు మీదుగా సుమారు 60కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తుపాన్ కారణంగా ముంచంగిపుట్టు మండలంలోని జోలాపుట్ జలాశయం ప్రమాదకర స్థాయికి చేరింది. 30వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో మచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలోకి నీరు చేరింది. అల్లూరి జిల్లా వ్యాప్తంగా పర్యాటక ప్రదేశాలు ప్రమాదకరంగా మారాయి. హుకుంపేట మత్స్యగుండం, జి.మాడుగుల కొత్తపల్లి వాటర్ ఫాల్స్, డుంబ్రిగుడ, చాపరాయి జలపాతం, తారాబు పెదబయలు జలపాతం సహా ఇతర జలపాతాలన్నీ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పాడేరు మండలం పరదానిపుట్టువాగు పొంగడంతో 3 రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి.

నిలిచిన రాకపోకలు

విజయనగరం జిల్లా రేగిడి మండలంలోని ఆకులలోవగడ్డ పొంగి రేగిడి గ్రామాన్ని వరద చుట్టు ముట్టింది. గ్రామంలోని కార్యాలయాలను ముంచేసింది. సంతకవిటి మండలంలో సాయన్నగడ్డ, రెల్లిగడ్డలు వరద పోటెత్తడంతో వందలాది ఎకరాలు నీటి మునిగాయి. సిరిపురం వద్ద రెల్లిగడ్డ పొంగడంతో సంతకవిటి, పొందూరు మండలాలకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వంగర మండలంలో సువర్ణముఖి, వేగావతి నదుల ఉధ్ధతి వల్ల కొండచాకరాపల్లి గ్రామంలో వందలాది ఎకరాలు నీటి మునగాయి. విజయనగరంలోని పలు కాలనీలు నీట మునిగాయి. పెద్ద చెరువుకి భారీ వరద చేరడంతో దిగువన ఉన్న లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నాయుడు కాలనీ, వినాయక నగర్, పద్మావతి నగర్‌లోని పలు ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. పార్వతీపురం మన్యం జిల్లాలో జలాశయాలు నిండుకుండలా మారాయి. పాచిపెంట మండలం పెద్దగెడ్డ జలాశయానికి వరద పోటెత్తింది. అర్నబ్ తుఫాను కారణంగా సాలూరు మండలంలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. బొప్పాయి, అరటి సహా ఇతర పంటలు దెబ్బతిన్నాయి. చేతికందే సమయంలో పంటలు నేలపాలు కావడంతో కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాలూరులో వేగవతి ఉధృతి కారణంగా లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. రాత్రంతా నిద్రలేకుండా గడిపామని, ఇంట్లో సామగ్రి తడిసి పాడైందని బాధితులు చెబుతున్నారు. జిల్లా కేంద్రం పార్వతీపురం పట్టణంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. తుపాన్ వల్ల జిల్లాలో రాకపోకలకు అంతరాయం కలిగింది. పాలకొండ-సీతంపేట మార్గంలో గుడిగడ్డ ఉప్పొంగి రాకపోకలు స్తంభించాయి. పాలకొండ మండలంలోని రావాడిగడ్డ, జంపర్ కోటగడ్డ, ఓనిగడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. బీపీ.రాజుపేట, తప్పటపల్లి, బాసురు ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైంది.

తుపాను బాధితులకు అండగా నిలవండి

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... 'గ్రామ, వార్డు సచివాలయాల నిర్వీర్యం, వాలంటీర్ల వ్యవస్థ రద్దు ప్రభావం తుపాను సహాయక చర్యలపై స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వం విపత్తులను ఆదాయ వనరుగా మార్చుకోవాలనుకుంటోంది' అని విమర్శించారు. సోనా మసూరి బియ్యం ధర కేజీ రూ.90 దాటిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోని కీలక నేతలే బియ్యం ధరల పెరుగుదలకు కారణమని ఆరోపించారు. 'మంత్రి పయ్యావుల వియ్యంకుడు సహా టీడీపీ నేతలు బియ్యాన్ని మార్కెట్లోకి రానీయకుండా బ్లాక్ చేసి, ఎక్స్‌పోర్టు చేస్తున్నారు. విపత్కర పరిస్థితుల్లోనూ బియ్యం మాఫియాను ప్రోత్సహిస్తున్నారు' అని జగన్ వ్యాఖ్యానించారు. తుపాను కారణంగా వరి, ఆక్వా, పండ్ల తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఈ క్లిష్ట సమయంలో బాధితులకు తోడుగా నిలవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ధాన్యం సేకరణలో రైతులకు అండగా ఉంటూ, ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేసేలా ఒత్తిడి తీసుకురావాలని జగన్ స్పష్టం చేశారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు

- ఎస్కేయూ వీసీ ఆచార్య జ్యోతి కుమార్, అనంతపురం రూరల్ అడిషనల్ ఎస్పీ అశ్విన్ మణిదీప్
- ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ గీతం ఆవిష్కరణ

అనంతపురం, అక్టోబర్ 29, పెన్ సత్తా::: సంతోష సమయాల్లోనూ.. సంక్షో భాలలోనూ పోలీసు అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తున్నారని, పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యా లయం ఉపకులపతి ఆచార్య జ్యోతి కుమార్, అనంతపురం రూరల్ అడిషనల్ ఎస్పీ అశ్విన్ మణిదీప్ కొనియాడారు. గురువారం శ్రీకృష్ణదేవరాయవిశ్వవిద్యాలయం పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాలులో వర్సిటీ పూర్వ విద్యార్థి, అభ్యుదయ కవి డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్ రచించిన పోలీసు అమరవీరుల సంస్మరణ గీతాన్ని వైస్ ఛాన్సలర్ జ్యోతి కుమార్, అడిషనల్ ఎస్పీ అశ్విన్ మణిదీప్ ముఖ్య అతిథులుగా హాజరై పాట సీడీని ఆవిష్కరించారు. రెడ్స్ స్వచ్ఛంద సంస్థ, వర్సిటీ తెలుగు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రెడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సీఈవో భానూజా అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథులుగా రెక్టార్ ఆచార్య అనిత, రిజిస్ట్రార్ ఈ. రమేష్ బాబు, వర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సోమశేఖర్, అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల అధినేత అనంత రాముడు, ఇటుకులపల్లి సీఐ హేమంత్ కుమార్, ఎస్.ఐ విజయ్ కుమార్, ఏపీడబ్ల్యూ జేఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్షులు రేపటి రామాంజ నేయులు, ఎలక్ట్రానిక్ మీడియా అనంతపురం జిల్లా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, సూర్య నేటి దినపత్రిక రీజనల్ బ్రాంచ్ మేనేజర్ లక్ష్మీ నారాయణ, బ్యూరో చీఫ్ మొయినుద్దీన్, వర్సిటీ పీఆర్వో ఆచార్య సత్యనారాయణ, ఆచార్య రమణ, ఉమ్మడి అనంతపురం జిల్లా చిన్న పత్రికల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఓబుళంపల్లి రామక్రిష్ణ, పాట రచయిత డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్ పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా

వీసీ జ్యోతి కుమార్ మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో సైనికులు, సమాజంలో పోలీసులు తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ వేడుకల్లోనూ, క్లిష్ట పరిస్థితుల్లోనూ అహర్నిశలు విధులు నిర్వర్తిస్తుండడం అభినందనీయమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడకుండా బాధ్యతలు నిర్వర్తిస్తున్న పోలీసు శాఖకు ప్రజలు, సమాజం రుణపడి ఉంటుందన్నారు. వారి త్యాగాలను సమాజం గుర్తించి, పోలీసు కుటుంబాలకు తగిన సహాయ సహకారాలు అందించాలన్నారు. ఖాకీ గుండెల్లో కరుణామయమూర్తులై అనే భావానికి రచయిత చంద్రశేఖర్ అక్షర రూపం ఇచ్చారని, ఈటీవీ పాడుతా తీయగా సుధాకర్ ఎంతో ఆర్ద్రంగా గీతాన్ని ఆలపించారని అభినందించారు. ఇంత గొప్ప చైతన్య గీతాన్ని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఆవిష్కరించుకోవడం తమ అదృష్టమనీ వీసీ భావోద్వేగంతో పేర్కొన్నారు. అడిషనల్ ఎస్పీ అశ్విన్ మణిదీప్ మాట్లాడుతూ అమరులైన పోలీసుల త్యాగాల స్ఫూర్తితో ప్రతి పోలీసు అధికారరులు, సిబ్బంది అంకిత భావంతో కూడిన విధి నిర్వహణకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ' కళ్ళల్లో కన్నీటి దీపాలై..' వంటి వాక్యాలు హృదయాన్ని కదిలిస్తాయన్నారు. పోలీసు అమరవీరులను స్మరిస్తూ అద్భుతమైన చైతన్య గీతాన్ని రాసిన ఉద్దండం చంద్రశేఖర్, గాయకుడు సుధాకర్ కు జిల్లా పోలీసు శాఖ తరపున ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అనంతరం ఎల్ఈడి స్క్రీన్ లో పాట వీడియోను అతిథులు ఆస్వాదించారు. పోలీస్ అమరవీరుల గీత రచయిత డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్, రెడ్స్ సీఈవో భానూజాను వీసీ జ్యోతి కుమార్ ఘనంగా సత్కరించారు. అతిథులకు రెడ్స్ సంస్థ ప్రతినిధులు ఆత్మీయ సత్కారం చేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల ఆచార్యులు, రెడ్స్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ అనిత, కిసాన్ మిత్ర నరసింహులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో నేడు కూటమి ఎన్నికల సమరభేరి

- హాజరుకానున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, అహుడా చైర్మన్ టి.సి. వరుణ్

పుట్టపర్తి,అక్టోబర్ 29, పెన్ సత్తా:::పుట్టపర్తి మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో రాజకీయ సందడి నెలకొననుంది. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం (అక్టోబర్ 30) పుట్టపర్తి పట్టణంలో భారీ ఎన్నికల ర్యాలీ, పాదయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, అహుడా చైర్మన్ టి.సి. వరుణ్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. ఉదయం 10 గంటలకు విద్యాగిరి ఆర్చ్ వద్ద ర్యాలీ ప్రారంభమై, అక్కడి నుంచి చిత్రావతి బ్రిడ్జి వరకు భారీ ర్యాలీ, పాదయాత్ర కొనసాగనుంది. పుట్టపర్తి నియోజకవర్గంలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం విజ్ఞప్తి చేసింది. నియోజకవర్గంలోని ప్రతి మండలం, ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో తరలివచ్చి కూటమి ఐక్యతను, బలాన్ని చాటాలని పిలుపునిచ్చింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు విద్యాగిరి ఆర్చ్ వద్దకు చేరుకుని, సమయపాలన పాటిస్తూ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించింది. ఎన్నికల ప్రచారంలో ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని పేర్కొంది.

నవంబర్ 1న చలో ఢిల్లీ ఓటు బచావో దేశ్ బచావో - జిల్లా కాంగ్రెస్ పార్టీ

అనంతపురం, అక్టోబర్ 29, పెన్ సత్తా::జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి జిల్లా అధ్యక్షుడు వై మధు సూధన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యం.యం.డి. ఇమామ్ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం ఓట్ బచావో -- దేశ్ బచావో" కార్యక్రమంపై మీడియా సమావేశం నిర్వహిం చడం జరిగింది.ఈ కార్యక్ర మంలో మముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏఐసీసీ పరిశీలకులు డాక్టర్ బెల్లయ్య నాయక్ తేజవత్ గారు, ఏపీసీసీ కోఆర్డినేటర్ ఇర్ఫాన్ బాషా, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యం.యం.డి.ఇమామ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం మరియు ఎన్నికలు కమిషన్ తొలగించిన 13 కోట్ల ఓట్ల పై నిరసనగా ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా నవంబర్ 1న డిల్లి రామ్ లీలా మైదానంలో జరిగే ఓటు బచావో దేశ్ బచావో కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర నాయకులు ముజమ్మిల్, సుధాకర్, దస్తగిరి, అమర్నాథ్, నారాయణస్వామి, రాజు, రమేష్ , బాబు సాబ్, తదితరులు పాల్గొన్నారు.ం

కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం

పెనుకొండ, అక్టోబర్ 29, పెన్ సత్తా::పురపాలక సంఘం పరిధిలో జరగనున్న సాధారణ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు గురువారం శిక్షణ కార్యక్రమంను నిర్వహించారు. పెనుకొండ పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్ అధ్యక్షతన మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్డీవో ఆనంద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు కౌంటింగ్ ప్రక్రియలో పాటించాల్సిన నియమ నిబంధనలు, ఓట్ల లెక్కింపు విధానం, కౌంటింగ్ సిబ్బంది బాధ్యతలు, విధుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించేందుకు ప్రతి అధికారి తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని శిక్షణలో వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఎన్నికల అధికారులు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

2వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్న కార్పొరేటర్ కాంగ్రెస్ అభ్యర్థిని జాహీదా బేగం

డివిజన్ అభివృద్ధి కావాలంటే హస్తం గుర్తుకు ఓటు వేయండి. యం.యం.డి.ఇమామ్

అనంతపురం, అక్టోబర్ 29, పెన్ సత్తా:::నగరంలోని 2వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి జాహీదా బేగం ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఇంటింటికీ తిరుగుతూ నేరుగా ప్రజలను కలసి తనకు ఓటు వేసి వేయించి అత్యధిక భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల ప్రచారానికి మద్దతుగా అనంతపురం నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుయం.యం.డి.ఇమామ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అనంతపురం నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు యం.యం.డి.ఇమామ్ మాట్లాడుతూ 2వ డివిజన్ లో అందరికీ సుపరిచితురాలు, గతంలో వార్డు వాలంటీర్‌గా పని చేసిన అనుభవం, కరోనా సమయంలో ధైర్యంగా కుటుంబ సమేతంగా సేవలందించిన జాహీదా బేగం కు స్థానిక 2వ డివిజన్ ప్రజా సమస్యలపై మంచి అవగాహన ఉందని తెలిపారు. ప్రజలు ఆమెను ఆశీర్వదించి, తమ అమూల్యమైన, పవిత్రమైన ఓటును హస్తం గుర్తుకు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వచ్చిన విద్యావం తురాలు జాహీదా బేగం కు ప్రజలు ఓటు ద్వారా తమ మద్దతు అందించాలని కోరారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, వారి ఆశయాలకు అనుగుణంగా సేవలందించేందుకు కృషి చేసే అభ్యర్థిని గెలిపించుకోవడం ప్రజల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, జాహీదా బేగం కు తమ ఇంటి బిడ్డగా భావించి తమ అమూల్యమైన ఓటు ను హస్తం గుర్తుకు వేసి కార్పొరేటర్ అభ్యర్థిగా జాహీదా బేగం గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో నగర కాంగ్రెస్ పార్టీ నాయకులు ముజమ్మిల్ , ఎస్.యం.భాష, హామీదా, షాను, చాందిని, ఖాలీద్, ఆసిమ్, ఆజమ్, భాయ్ తదితరులు పాల్గొని అభ్యర్థికి మద్దతు తెలిపారు

స్థానిక సంస్థల ఎన్నికల్లో లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలి

జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

అనంతపురం సిటీ, అక్టోబర్ 29, పెన్ సత్తా::మున్సిపాలిటీ ఎన్నికల కోసం ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. గురువారం గుత్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ ను, రిసెప్షన్ మరియు మెటీరియల్ పంపిణీ కేంద్రాలను అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్ తో కలిసి జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ మరియు మెటీరియల్ పంపిణీ కేంద్రం వద్ద అన్ని ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని పలు సూచనలను జారీ చేశారు. ఈ సందర్భంగా రిసెప్షన్ మరియు మెటీరియల్ పంపిణీ కేంద్రం వద్ద ఏవిధమైన జాగ్రత్త చర్యలు తీసుకున్నారు, తదితర వివరాలు ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ ఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, తహసిల్దార్ పుణ్యవతి, ఎలక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఎంపిటిసి అభ్యర్థి నంద్యాల ఆదిలక్ష్మిని గెలిపించాలని విస్తృతంగా ప్రచారం

యాడికి, అక్టోబర్ 29, పెన్ సత్తా::మండల కేంద్రంలోని5వఎంపీటీసీ వార్డు, టీచర్స్ కాలనీ ,లాలెప్ప కాలనీ హాస్పిటల్ కాలనీ నందు గురువారం ఎంపిటిసి అభ్యర్థి నంద్యాల ఆదిలక్ష్మి ని,జడ్పిటిసి అభ్యర్థి వేలూరు రంగయ్య ను గెలిపించాలని తెదేపా నాయకులు కార్యకర్తలు ప్రచారం చేశారు.తెదేపా ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేశారని తెలిపారు.ఇంటింటి తిరిగి కర పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జడ్పిటిసి అభ్యర్థి వేలూరు రంగయ్య ,ఎంపీపీ అభ్యర్థి గంగిరెడ్డి రవి కుమార్ రెడ్డి , ఎంపీటీసీ అభ్యర్థి నంద్యాల ఆదిలక్ష్మి, మాజీ ఎంపీటీసీ దడియాల ఆదినా రాయణ నంద్యాల రంగస్వామి ,చిట్టెపు చంద్రశేఖర్ రెడ్డి ,యాడికి మండల బీసీ సెల్ కన్వీనర్ తిరంపురం నీలకంఠ, పెయింటర్ విజయ్, బాలం శ్రీనివాసులు, పూల తోట చంద్ర ,కూన వెంకటస్వామి, వీరన్న, పల్లె రమేష్ , కళ్ళేముని, నంద్యాల బడిగించల ఆంజనేయులు, రామచంద్ర , సింహం నాగరాజు ,తదితర టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

వెదురు గడ్డ వరద ఉధృతిని పరిశీలించిన కలెక్టర్ విజయ్ కృష్ణ .

నాతవరం అక్టోబర్ 29, పెన్ సత్తా::నాతవరం మండలం గన్నవరం మెట్ట వద్ద అర్నబ్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వెదురు గడ్డ ఉధృతి పెరిగి రాకపోకలకు అంతరాయం కలిగింది .ఈ మేరకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నర్సీపట్నం డిఎస్పి సూచనల మేరకు సిఐఎల్ రేవత్తమ్మ పర్యవేక్షణలో నాతవరం పోలీస్ స్టేషన్ ఎస్సై తారకేశ్వరరావు తన సిబ్బందితో కలిసి భద్రతా చర్యలు చేపట్టారు .శుక్రవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కె విజయ కృష్ణన్ ఆకస్మిక తనిఖీ నిమిత్తం వెదురుగడ్డ వంతెన దగ్గరకు వచ్చి మొత్తం అంతా పరిశీలించారు .ఆమె మాట్లాడుతూ ప్రాణ నష్టం జరగకుండా చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి జాగ్రత్తలు తీసుకున్నందుకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణ ఎస్సై వై తార్కేశ్వర్రావుని .తాసిల్దార్ ఓ చందన రేఖని అభినందించారు .ఈ కార్యక్రమంలో ఆర్డీవో వివి రమణ .ఎంపీడీవో ఎంఎస్ శ్రీనివాస్ .ఇరిగేషన్ డిపార్ట్మెంట్ .ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్.గన్నవరం పిఎస్సిఎస్ అధ్యక్షులు సింగంపల్లి సన్యాసి దేవుడు .ఇతర అధికారులు పాల్గొన్నారు .

పెనుకొండలో 8, 9 వార్డుల్లో మంత్రి సవితమ్మ ఎన్నికల ప్రచారం

- సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించండి

పెనుకొండ, అక్టోబర్ 29, పెన్ సత్తా::పెనుకొండ మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా 8, 9వ వార్డుల్లో బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవితమ్మ గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ అభ్యర్థి త్రివేంద్ర మూర్తితో పాటు 8వ వార్డు అభ్యర్థి బర్కత్, 9వ వార్డు అభ్యర్థి షబీరా భానుకు మద్దతుగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వార్డుల్లో పర్యటిస్తూ ఓటర్లను కలిశారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని, సైకిల్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. దర్గా పేట అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి ఈసందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అభ్యర్థి షౌకత్ నాయకులు ఫారుక్ స్థానిక టీడీపీ నాయకులు, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా వసుంధర దేవి రోడ్‌షో

- మంజునాథ్‌తో కలిసి విస్తృత ప్రచారం.. పలు వార్డుల్లో ప్రజలతో మమేకం

హిందూపురం, అక్టోబర్ 29, పెన్ సత్తా:మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి గురువారం హిందూపురం పట్టణంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పురిడి మంజునాథ్‌తో కలిసి పలు వార్డుల్లో రోడ్‌షో చేపట్టి, కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. వసుంధర దేవి పర్యటనతో ఆయా ప్రాంతాల్లో ఎన్నికల ప్రచార సందడి నెలకొంది. పట్టణంలోని మోతకపల్లి, అహ్మద్‌నగర్, ఆర్‌పీజీటీ రోడ్డు, హస్నాబాద్, బాపూజీనగర్, పరిగి రోడ్డు, నిక్కంపల్లి, ఎన్టీఆర్ కాలనీ, ఎడ్లపల్లి, టీచర్స్ కాలనీ, హౌసింగ్ బోర్డు, కంసాలపేట, వీడీ రోడ్డు, పాండురంగనగర్, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో రోడ్‌షో నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. చైర్మన్ అభ్యర్థి మంజునాథ్‌తో పాటు ఆయా వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేస్తూ, ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ కూటమి అభ్యర్థుల విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా వసుంధర దేవి పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. చైర్మన్ అభ్యర్థి మంజునాథ్‌తో కలిసి ఆమె వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రచారాన్ని విస్తృతం చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ అభ్యర్థి మంజునాథ్ సతీమణి యుక్తాశ్రీ, ఆయా వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు, బాలకృష్ణ అభిమానులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించండి

- ఎన్నికల్లో మంచి మెజారిటీతో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- నాయకుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

హిందూపురం, అక్టోబర్ 29, పెన్ సత్తా:::కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హిందూపురం పురపాలక సంఘంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి ఎన్నికల్లో మంచి మెజారిటీతో గెలుపొందేలా నాయకులు సమష్టిగా కృషి చేయాలని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సూచించారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవాలని దిశానిర్దేశం చేశారు. హిందూపురంలోని తన నివాసంలో గురువారం మున్సిపల్ ఎన్నికలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ఆయన నాయకులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. తొలుత పురపాలక సంఘ పరిధిలోని వాల్మీకి, మైనారిటీ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ తదితర సామాజిక వర్గాల నాయకులతో విడివిడిగా సమావేశమయ్యారు. ఆయా వర్గాలకు చెందిన నాయకులతో ఎన్నికల పరిస్థితులు, ప్రజల అభిప్రాయాలు, పార్టీ విజయావకాశాలపై చర్చించారు. పట్టణంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాల గురించి వారికి వివరించారు. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఎన్నికల సమయంలో నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలని బాలకృష్ణ సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పట్టణంలోని ప్రతి వార్డుపై ప్రత్యేక దృష్టి సారించి, స్థానిక సమస్యలను తెలుసుకుంటూ ఓటర్లను కలవాలని, ప్రభుత్వం చేపట్టిన పనులను ప్రజలకు వివరించాలని దిశానిర్దేశం చేశారు. కేవలం ఎన్నికల ప్రచారానికే పరిమితం కాకుండా ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించాలని, అన్ని సామాజిక వర్గాల నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. అనంతరం హిందూపురం రూరల్ మండలానికి చెందిన ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులతో పాటు మండల నాయకులతో సమావేశమయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ప్రతి ఇంటికీ చేరవేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలతో మమేకమై, వారి సమస్యలను తెలుసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. అభ్యర్థులు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికలతో పాటు గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు సమష్టిగా పనిచేయాల్సిన అవసరాన్ని బాలకృష్ణ వివరించారు. సామాజిక వర్గాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులను కలుపుకొని ఎన్నికల వ్యూహాలను అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశాల్లో ఎంపీపీ అభ్యర్థి మంజునాథ్, హిందూపురం రూరల్ మండల కన్వీనర్ రాము, ఎంపీటీసీ అభ్యర్థులు, జడ్పీటీసీ అభ్యర్థి, వివిధ సామాజిక వర్గాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పలు వార్డుల్లో దీపిక, షాజియా విస్తృత ప్రచారం

హిందూపురం, అక్టోబర్ 29, పెన్ సత్తా::;ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక కోరారు. గురువారం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి షాజియా కౌన్సిలర్ అభ్యర్థి నాగేంద్ర తదితర అభ్యర్థులతో కలిసి పట్టణంలోని కొల్లకుంట, ఇందిరమ్మ కాలనీ, కొట్నూరు తదితర ప్రాంతాల్లో రోడ్‌షోలు నిర్వహిస్తూ విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం తమ పార్టీకి రెండు కళ్ల వంటివని అన్నారు. జగనన్న ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంతోపాటు, ప్రభుత్వ సేవల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రతి వార్డుకు సచివాలయాన్ని ఏర్పాటు చేయడంతోపాటు, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే తీసుకొచ్చామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వాలంటీర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసి, సంక్షేమ పథకాల అమలును గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందాలన్నా, పట్టణం అభివృద్ధి చెందాలన్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తమ పార్టీ అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులతోపాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు వేణు రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పులివెందులలో ఎన్నికల విధ్వంసానికి కుట్ర

పోలింగ్‌కు పటిష్ట భద్రత కల్పించాలి
బయటి వ్యక్తులతో అల్లర్లు, దొంగ ఓట్లు, రిగ్గింగ్‌కు ప్రణాళిక
ఎస్ఈసీ తక్షణ చర్యలు తీసుకోవాలి: పుత్తా శివశంకర్

తాడేపల్లి: అక్టోబర్ 29, పెన్ సత్తా:: పులివెందులలో పోలింగ్ రోజున భారీ విధ్వంసానికి కుట్ర జరుగుతోందని వైయస్ఆర్‌సీపీ అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల నుంచి టీడీపీకి చెందిన గూండాలను పులివెందులకు రప్పించి అల్లర్లు సృష్టించేందుకు, దొంగ ఓట్లు, ఓట్ల రీసైక్లింగ్, రిగ్గింగ్ ద్వారా ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారని పేర్కొన్నారు. పోలింగ్ రోజున పోలీసుల సంఖ్య తగ్గించడం వెనుక కుట్ర ఉందని, అల్లర్లను అదుపు చేయలేకపోయామనే సాకు చూపి వైయస్ఆర్‌సీపీ నాయకులు, పోలింగ్ ఏజెంట్లను అరెస్టు చేసి ప్రతిపక్షాన్ని నిర్బంధించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కమలాపురం, రాయచోటి, అనంతపురం ప్రాంతాల నుంచి బయటి వ్యక్తులను రప్పించి తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద అరాచకాలు సృష్టించి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నారని విమర్శించారు. పోలింగ్‌కు ముందురోజు నుంచే పులివెందులలో లైవ్ వెబ్‌కాస్టింగ్ ప్రారంభించి, పోలింగ్ కేంద్రాల లోపల, బయట నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని పుత్తా శివశంకర్ డిమాండ్ చేశారు. వెబ్‌కాస్టింగ్ దృశ్యాలను పూర్తిస్థాయిలో భద్రపరచాలని, టీడీపీ నాయకుల ఇళ్లు, హోటళ్లలో తనిఖీలు నిర్వహించి బయటి వ్యక్తులను వెంటనే పంపించాలని కోరారు. పోలింగ్ రోజున అదనపు పోలీసు భద్రత కల్పించి, గత జెడ్పీటీసీ ఉప ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. చంద్రబాబు కుట్రలను అడ్డుకుంటారా, వాటిలో భాగస్వాములవుతారా అన్నది రాష్ట్ర ఎన్నికల సంఘం తేల్చుకోవాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేలా నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించాలని, పులివెందుల ప్రజలు భయపడకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

జగనన్న పాలనలోనే సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు జరిగాయి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి
- వైసీపీ మహిళ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేశాయి భారతి రెడ్డి పిలుపు



కదిరి,అక్టోబర్ అక్టోబర్ 29, పెన్ సత్తా::నంబూల పూలకుంట మండలంలోని గోపాల పురం ఎగువ పల్లి వెలిచెలమల ఎస్కే తాండా రామాపురం వడ్డి పల్లి తదితర గ్రామంలో గురువారం వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి ముసలి రెడ్డి గారి అనురాధమ్మ తరపున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేశాయి భారతి రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. రెండున్నరేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం అన్ని విధాలా పాలనలో విఫలం అయిందని రాబోయే రోజుల్లో జగనన్న ను ముఖ్యమంత్రిని చేసుకుంటే మళ్ళీ మంచి రోజులు వస్తాయని తెలిపారు. కావున స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని వారు కోరారు. గత ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించామని వాటిని లబ్ధిదారులు గుర్తుంచు కోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు సక్రమంగా నెరవేర్చ డంలేదని తెలిపారు. జగనన్న హయాంలో అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందాయని మళ్ళీ మంచిరోజులు వస్తాయని తెలిపారు. జరగబోయే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. అప్యాయతతో కొబ్బరి బోండాలు ఇచ్చి ఘనంగాసత్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు హరీష్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు

ఎరుపెక్కిన ఆకాశం..

ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లో ఆకాశం అకస్మాత్తుగా రక్తవర్ణంలోకి మారడం తీవ్ర కలకలం రేపింది. దంతెవాడ, కిరండోల్ వంటి ప్రదేశాల్లో నింగి ఎర్రగా మారిన దృశ్యాలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాయి. అర్నబ్ తుపాను కారణంగానే వాతావరణంలో ఈ వింత మార్పు చోటుచేసు కుందని స్థానికులు, నెటిజన్లు అభిప్రాయపడు తున్నారు. అయితే, ఆకాశం ఎర్రగా మారడానికి, తుపానుకు మధ్య ఉన్న సంబంధంపై అధికారికంగా ఎటువంటి ధ్రువీకరణ లేదు. తుపాను సమయంలో బలమైన గాలులు వీచినప్పుడు భారీ మొత్తంలో ధూళి, ఇసుక, ముఖ్యంగా ఇనుము అధికంగా ఉండే ఎర్రమట్టి గాలిలోకి లేస్తాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. 'న్యూయార్క్ టైమ్స్' కథనం ప్రకారం.. ఈ ధూళి కణాలు వాతావరణంలోని పైపొరల్లోకి చేరడం వల్ల ఆకాశం అసాధారణంగా ఎర్రటి రంగులో కనిపిస్తుంది. అర్నబ్ తుపాను విషయంలోనూ ఇదే జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ భయానక దృశ్యాలు సోషల్ మీడియాలో

సృజనాత్మక చర్చకు దారితీశాయి. ప్రముఖ నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'స్ట్రేంజర్ థింగ్స్'లోని 'అప్‌సైడ్ డౌన్' ప్రపంచాన్ని గుర్తుచేస్తోందని ఒక యూజర్ కామెంట్ చేయగా, 'వెక్నా వస్తున్నాడు' అంటూ మరో యూజర్ పోస్ట్ చేశారు. మరికొందరు దీన్ని 'ఈవిల్ డెడ్' సినిమా సెట్‌తో పోల్చారు. అయితే, కొందరు మాత్రం ఇది ప్రమాదకరమైన సంకేతం కావచ్చని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

ఇలాంటి ఘటనే ఈ ఏడాది మే నెలలో ఆస్ట్రేలియాలోనూ చోటుచేసుకుంది. 'నరెల్లే' తుపాను పశ్చిమ ఆస్ట్రేలియాలోని డెన్‌హామ్‌ను తాకినప్పుడు ఆకాశం ఇలాగే ఎర్రగా మారింది. అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ ప్రకారం, ఆస్ట్రేలియాలోని ఆ ప్రాంత నేలల్లో ఇనుము శాతం అధికంగా ఉంటుంది. తుపాను గాలుల వల్ల ఈ మట్టి గాలిలో కలిసి ఆక్సీకరణకు గురైనప్పుడు, ఆకాశం అంగారక గ్రహంలా ఎరుపు రంగులోకి కనిపిస్తుంది. కాగా, 'అత్యంత తీవ్రమైన తుపాను'గా భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వర్గీకరించిన అర్నబ్ తుపాను, అక్టోబర్ 28న గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటింది. దీని ప్రభావంతో భారీ వృక్షాలు నేలకూలాయి, పంటలు, ఇళ్లు నీట మునిగాయి. రవాణా, విద్యుత్ వ్యవస్థలకు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు, మత్స్యకార కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి.

రబీ సాగుపై ఎల్‌నినో పంజా

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం దేశంలో వ్యవసాయ రంగంపై ఆందోళన పెంచుతున్నాయి. ఇప్పటికే ఖరీఫ్ (వర్షాకాలం) పంటల సీజన్‌ను అతలాకుతలం చేసిన ఎల్‌నినో ప్రభావం ఇప్పుడు రబీ (శీతాకాలం) పంటలపైనా తీవ్రంగా పడుతోంది. ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతం నమోదు కావడంతో వాతావరణ సమతుల్యత పూర్తిగా దెబ్బతింది. దీని వల్ల పొలాల్లో తగినంత తేమ లేక రైతులు సాగు పనుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేలలో తేమ తగ్గడం సహా సాగునీటి లభ్యతపై ఆందోళనల కారణంగా గోధుమలు, శనగలు సహా పలు పంటల సాగు నెమ్మదించింది. ఈ ఎల్‌నినో- రబీ పంటల విత్తనాలు వేసే ప్రక్రియను తీవ్రంగా ప్రభావితం చేసింది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ తాజాగా విడుదల చేసిన నివేదిక ఈ ఆందోళనకరమైన పరిస్థితుల్ని కళ్లకు కట్టింది.

సగానికిపైగా పడిపోయిన గోధుమల సాగు

సాధారణంగా గోధుమల సాగు కాలం దేశంలో అక్టోబర్ నుంచి నవంబర్ వరకు ఉంటుంది. మార్చి- ఏప్రిల్ నాటికి కోతకు వస్తుంది. అయితే కేంద్ర వ్యవసాయ శాఖ రిపోర్ట్ ప్రకారం గత పంటల కాలం (2025-26) అక్టోబర్ 23వ తేదీ గణాంకాలతో పోలిస్తే, ప్రస్తుత పంటల సంవత్సరంలో (2026-27) గోధుమల సాగు విస్తీర్ణం ఏకంగా 59 శాతం క్షీణించింది. గతేడాది ఇదే సమయానికి దేశంలోని వివిధ రాష్ట్రాల్లో 27 వేల (0.27 లక్షలు) హెక్టార్లలో గోధుమ విత్తనాలు వేయగా, ఈసారి చూస్తే అది కేవలం 11 వేల (0.11 లక్షలు) హెక్టార్లకే పరిమితమైంది. గోధుమలతో పాటు

శనగలు, అన్ని రకాల పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం కూడా భారీగా పడిపోయింది. గతేడాది అక్టోబర్ 23 నాటికి 3.77 లక్షల హెక్టార్లలో శనగలు సాగు చేయగా, ఈసారి 2.21 లక్షల హెక్టార్లకే పరిమితమైంది. పప్పుధాన్యాలు, నూనె గింజల సాగు తగ్గడం కూడా ఆహార సరఫరాపై ప్రభావం చూపొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది.

రాజస్థాన్‌లోనే 58 శాతం తగ్గిన రబీ సాగు

రాజస్థాన్ రాష్ట్రంలో రబీ పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గోధుమలు, ఆవాలు, బార్లీ, శనగలు, కందులు, బఠానీలు వంటి పంటలు కలిగి గతేడాది ఇక్కడ అక్టోబర్ 23 నాటికి 14.13 లక్షల హెక్టార్లలో సాగు చేశారు. ఈ ఏడాది అదే తేదీ నాటికి చూస్తే 5.93 లక్షల హెక్టార్లలోనే సాగు జరిగింది. ఇక్కడ రికార్డు స్థాయిలో 8.21 లక్షల హెక్టార్ల మేర తగ్గుదల నమోదైంది. ఇది దాదాపు 58 శాతానికి సమానం. తమిళనాడులో కూడా రబీ సాగు విస్తీర్ణం సగానికి సగం తగ్గింది. యూపీలో స్వల్పంగా ప్రభావం కనిపిస్తోంది. మధ్యప్రదేశ్‌లో గతేడాది 0.20 లక్షల హెక్టార్లలో రబీ సాగు కాగా, ఈసారి అసలు నమోదు కాలేదు. ఉత్తరాఖండ్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కేరళంలో గతేడాది 0.14 లక్షల హెక్టార్లతో పోలిస్తే ఈసారి 0.11 లక్షల హెక్టార్లలో సాగు నమోదైంది. ఇలా దేశవ్యాప్తంగా 2026, అక్టోబర్ 23 వ తేదీ నాటికి చూస్తే రబీ పంటల మొత్తం సాగు విస్తీర్ణం 18.02 లక్షల హెక్టార్లుగా ఉంది. గతేడాది ఇదే తేదీ నాటికి ఇది ఏకంగా 28.26 లక్షల హెక్టార్లుగా ఉండటం గమనార్హం. ఎల్‌నినో కారణాలతో ఈసారి 10.24 లక్షల హెక్టార్ల వరకు తగ్గుదల నమోదైంది. ఈసారి శీతాకాలంలో వరి సాగు విస్తీర్ణం కూడా సగానికి సగం తగ్గింది. ఇదిలా ఉండగా, జొన్న, సజ్జ, రాగులు, ఇతర చిరుధాన్యాలు వంటి వాటి సాగు విస్తీర్ణం మాత్రం 13 వేల హెక్టార్ల నుంచి ఈసారి 23 వేల హెక్టార్లకు పెరగడం విశేషం. అయితే అన్ని రాష్ట్రాల్లో సాగు తగ్గలేదు. కర్ణాటకలో రబీ పంటల సాగు విస్తీర్ణం 1.80 లక్షల హెక్టార్ల నుంచి 1.91 లక్షల హెక్టార్లకు పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా 0.23 లక్షల హెక్టార్లతో పోలిస్తే ఈసారి 0.37 లక్షల హెక్టార్లలో సాగు నమోదైంది. భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం దేశంలో రుతుపవనాల సీజన్‌లో జూన్- సెప్టెంబర్ మధ్య దేశంలో సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. పంజాబ్‌లో సాధారణం కంటే 38 శాతం, రాజస్థాన్‌లో 22 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్ చివరినాటికి ఈ రాష్ట్రాల్లోని జలాశయాల్లో నీటి నిల్వలు కూడా తక్కువగా ఉన్నాయి. దేశంలోని మొత్తం గోధుమ సాగు విస్తీర్ణంలో పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల వాటానే 31 శాతంగా ఉండగా, ఈ రాష్ట్రాల్లోనే ఇప్పుడు ఎక్కువగా సాగు విస్తీర్ణం తగ్గడం ఆందోళన కలిగిస్తోంది.

పోలీసుల లాఠీలకు భయపడొద్దు

నవంబర్ 1న ఇండీ కూటమి తలపెట్టిన చలో దిల్లీ ర్యాలీలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. పోలీసులు, లాఠీలకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. తమ కుతంత్రాలను ప్రయోగించే దమ్ము బీజేపీకి లేదన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవటానికి, దేశాన్ని కాపాడుకోవడానికి కలిసికట్టుగా నడుద్దామని రాహుల్ గాంధీ అన్నారు. ముఖ్యంగా రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా విద్యార్థి సంఘాలన్నీ ఈ మార్చ్‌లో పాల్గొనాలని కోరారు. ఇదో అద్భుతమైన మార్చ్ కాబోతుందని అన్నారు. ఇది కేవలం ఒక నిరసన మాత్రమే కాదని, ఈ దేశ ఆత్మ కోసం చేస్తున్న ప్రదర్శనగా రాహుల్ గాంధీ అభివర్ణించారు. "చలో దిల్లీ రాంలీలా మార్చ్, ఇది ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి, ఓటు చోరీని అరికట్టడానికి, రాజ్యాంగాన్ని రక్షించడానికి చేపట్టిన పాదయాత్ర. ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీది కాదు, ఇది భారతదేశ ఆత్మ పాదయాత్ర. నరేంద్ర మోదీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్‌లతో విసిగిపోయిన ప్రజలందరూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరుకునేవారు, రాజ్యాంగాన్ని రక్షించాలని కోరుకునే వారందరూ రావాలి. పోలీసులు, లాఠీల గురించి భయపడకండి. కుతంత్రాలను ప్రయోగించే దమ్ము బీజేపీకి లేదు. మాతో కవాతు చేయండి. రాజ్యాంగాన్ని, దేశాన్ని రక్షించడానికి మనం కలిసి నడుద్దాం. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇది దేశం కోసం జరుగుతున్న యాత్ర, ఇది మీ యాత్ర. మీరందరూ రండి మనమందరం కలిసి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని

కాపాడుకుందాం. భారతదేశంపై దాడి జరుగుతోందని, భావ వ్యక్తీకరణపై, ఆలోచనలపై, దాడి జరుగుతోందని మీరు భావిస్తే రాజకీయలతో సంబంధం లేకుండా వచ్చి మాతో చేరండి. ఇది ఒక అద్భుతమైన యాత్ర కానుంది. ఇది మన దేశ ఆత్మను కాపాడేందుకు జరుగుతున్న యాత్ర."

ఖర్గే నివాసంలో ఇండీ కూటమి నేతల మీటింగ్

మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో 'ఇండీ' కూటమికి చెందిన ఎంపీలు సమావేశమయ్యారు. ఖర్గేతో పాటు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్?, గౌరవ్ గొగోయ్? సహా ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు. శుక్రవారం జరగబోయే 'మాక్ పార్లమెంట్'తో పాటు ర్యాలీ ఏర్పాట్లపై చర్చించారు. మాక్? పార్లమెంట్?లో ప్రధాన ఎన్నికల కమిషనర్ (జజుజ) జ్ఞానేష్ కుమార్‌పై ప్రతీకాత్మకంగా 'అభిశంసన' ప్రక్రియను చేపట్టాలని వారు భావిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పార్లమెంటరీ కార్యకలాపాల తరహాలో నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం ప్రక్రియ ఒక పార్లమెంటు సమావేశంలా ఉంటుందని, ఇందులో అధికార, ప్రతిపక్షాలు ఉంటాయని పార్టీ వర్గాలు చెప్పాయి. సుమారు 40 మంది వక్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఈ కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. ఈ 'మాక్ పార్లమెంట్' తర్వాత నవంబర్ 1న భారీ బహిరంగ సభ (ర్యాలీ) జరగనుంది.

అనేది దేశంలోని మెజారిటీ వర్గాల ప్రజల రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును లాక్కోవడానికి ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా పన్నిన ఒక 'కుట్ర' అని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ కుట్రను ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అమలు చేశారని విమర్శించింది. సీఈసీ జ్ఞానేశ్? కుమార్ పదవి నుంచి వైదొలగాలని, ూ×=ను నిలిపివేయాలని, ఈసీఐనెట్ పోర్టల్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఎక్స్? వేదికగా తెలిపారు. ఎస్ఐఆర్ పూర్తయిన లేదా కొనసాగుతున్న కనీసం ఆరు రాష్ట్రాల్లో, ఇప్పటివరకు గుర్తించిన అనుమానిత విదేశీయుల సంఖ్య సుమారుగా 1,600 మంది ఓటర్లతో పోలిస్తే చాలా తక్కువ అంటూ పేర్కొన్న మీడియా నివేదికను పోస్ట్ చేశారు.

బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం..

'అర్నబ్' తుపాను సృష్టించిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ కోస్తా తీరం ఇంకా కోలుకోకముందే మరో ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి రాష్ట్రం వైపు కదిలే అవకాశం ఉండటంతో తీర ప్రాంత ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించిన తాజా సమాచారం ప్రకారం, దక్షిణ అండమాన్ సముద్రం పరిసర ప్రాంతాల్లో ఒక అల్పపీడనం ఏర్పడింది. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమ-వాయవ్య దిశగా పయనిస్తూ తీవ్ర అల్పపీడనంగా బలపడనుంది. ఆ తర్వాత మరో 24 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా కేంద్రీకృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ వాతావరణ వ్యవస్థ మరింత బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు పయనించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో నవంబర్ 2, 3 తేదీల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే 'అర్నబ్' తుపాను కారణంగా పంట నష్టం, ఆస్తి నష్టంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న కోస్తా జిల్లాల ప్రజలను ఈ కొత్త హెచ్చరిక మరింత ఆందోళనకు గురిచేస్తోంది. రానున్న రోజుల్లో దీని తీవ్రత, కదలికలపై మరింత స్పష్టత వస్తుందని అధికారులు పేర్కొన్నారు.

డిజిటల్ మోసాలకు బ్యాంకులే నష్టపరిహారం చెల్లించేలా జవాబుదారీగా చేయాలి

డిజిటల్ మోసాలు పెరుగుతున్న వేళ సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. డిజిటల్ మోసాల బాధితులకు నష్ట పరిహారం చెల్లించేలా బ్యాంకులను జవాబుదారీగా చేయాలని చెప్పింది. ఒకవేళ బ్యాంక్? తగిన శ్రద్ధ వహించడంలో విఫలమవడం వల్లే మోసం జరిగినట్లు రుజువైతే, డిజిటల్ అరెస్టుల వంటి నేరాల బాధితులకు వారు కోల్పోయిన మొత్తాన్నైనా నష్టపరిహారంగా అందించాలని ఆదేశించింది. బాధితులకు తగిన నష్టపరిహారం అందించేందుకు ప్రతిపాదిత నియంత్రణ చట్రం తప్పనిసరిగా నిబంధనలు కల్పించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్ట్ కుంభకోణం అంశంపై సుమోటోగా విచారణ జరిపిన సీజేఐ జస్టిస్? సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. డిసెంబర్ 31 నాటికి అమల్లోకి రానున్న ఆర్‌బీఐ కేవైసీ సవరణ ఆదేశాలను పరిశీలిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. ప్రతిపాదిత మార్గదర్శకాల పరిధిలోకి వచ్చే ఆర్థిక సంస్థల వివరాలను, బాధితులకు నష్టపరిహారం అందించడానికి పరిశీలిస్తున్న చర్యలను తెలియజేయాలని ధర్మాసనం ఆర్‌బీఐని కోరింది. మోసపోతున్న వినియోగదారుల అసాధారణ లావాదేవీల గురించి సమీపంలోని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేయడం బ్యాంకుల విధి అని తెలిపింది. ఖాతాదారుని నిర్ధరిత లావాదేవీల సరళికి భిన్నంగా ఉండే అసాధారణ లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేయడం, అనుమానాస్పద కార్యకలాపాలపై ఆటోమేటెడ్ రిపోర్టింగ్, లావాదేవీల ప్రామాణికతను నిర్ధరించడానికి భౌతిక ధ్రువీకరణ వంటి తప్పనిసరి నివారణ చర్యల అవసరాన్ని గుర్తు చేసింది. విచారణ సందర్భంగా కేంద్రం, ఇతర అధికారుల తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, గత ఏడాదితో పోలిస్తే నమోదైన డిజిటల్ అరెస్టు కేసులు సుమారు 50 శాతం తగ్గాయని కోర్టుకు తెలిపారు. కోర్టు జోక్యం, ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల సమన్వయ చర్యలు, ప్రజా అవగాహన ప్రచారాల వల్లే ఈ తగ్గుదల సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

'విద్యావంతులు డిజిటల్ మోసాలకు ఎలా బలి అవుతున్నారు'

మరోవైపు విద్యావంతులైన పౌరులు కూడా ఇలాంటి డిజిటల్ మోసాలకు ఎలా బలి అవుతున్నారంటూ సుప్రీం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజా చైతన్య కార్యక్రమాలు, వార్తా కథనాలు, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రజలు ఇంకా మోసపోతుండటం పట్ల భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "మేము ఆశ్చర్యపోతున్న విషయం ఏమిటంటే ప్రజలకు ఇంకా ఎందుకు అర్థం కావడం లేదు? బాధితులకు ఏమైంది? ఈ బాధితులు ఇలా ఎలా చిక్కుల్లో పడుతున్నారు? వారికి ఈ ప్రాథమిక విషయం అర్థం కావడం లేదా? మొబైల్‌లో అరెస్టు అవుతామనే భయం ఏమిటి? మీడియాలో దీని గురించి అంతగా ప్రచారం జరుగుతోంది కదా! ఒక ప్రజాస్వామ్య దేశంలో ఉంటూ మొబైల్ ఫోన్ ద్వారానే అరెస్టు చేస్తున్నారని ఎవరైనా ఎలా నమ్మగలరా?" అని అసహనం వ్యక్తం చేశారు. డిజిటల్ అరెస్టులను అరికట్టడానికి చాలా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ఈ సమస్య నిరంతరాయంగా కొనసాగుతోందని తనకు పదేపదే సమాచారం అందుతోందని ఈ కేసులో అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ న్యాయవాది ఎన్.ఎస్. నాప్పినై కోర్టుకు చెప్పారు. గత వారం ఇలాంటి ఘటనతో ఒక మహిళ రూ. 2.5 కోట్లు కోల్పోయిందని ఆమె కోర్టుకు తెలిపారు. "ఈ ప్రాథమిక విషయం వారికి అర్థం కావడం లేదా? మొబైల్ ద్వారా అరెస్టు అవుతామనే భయం ఏమిటి? మొబైల్‌ను గోడకు కొడితే అరెస్టు ఆగిపోతుంది. ప్రజలలో ఏదో లోపం ఉంది. అందులో ఏముందో దేవుడికే తెలియాలి. మిమ్మల్ని మీరే బాధితులుగా చేసుకుంటున్నారు. చదువుకున్న వారందరూ మోసపోతుండటం మాకు నిరాశ కలిగిస్తోంది. మీరే డిజిటల్ పద్ధతిలో అరెస్టు అయితే తర్వాతి తరానికి ఏమి అందిస్తారు? డిజిటల్ అరెస్ట్?పై ఏమైనా ఉత్తర్వులు ఉన్నాయేమో తెలుసుకోవడానికి ప్రజలు కోర్టు వెబ్‌సైట్‌కు కూడా వెళ్లవచ్చు." అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

మార్చి నాటికి భారత్‌లో ఎండలతో 55 వేల మరణాల ముప్పు?

భారత్‌కు ఎల్‌నినో రూపంలో మరో వాతావరణ ముప్పు పొంచి ఉందా? రాబోయే నెలల్లో అసాధారణ ఉష్ణోగ్రతలు ప్రాణనష్టాన్ని పెంచే ప్రమాదం ఉందని తాజా పరిశోధన ఆధారిత అంచనాలు హెచ్చరిస్తున్నాయి. అమెరికాలోని షికాగో విశ్వవిద్యాలయానికి చెందిన 'క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్' రూపొందించిన కొత్త ట్రాకర్ ప్రకారం.. 2026 అక్టోబర్ నుంచి 2027 మార్చి వరకు భారత్‌లో అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 55 వేల మరణాలు సంభవించే అవకాశం ఉంది. వీటిలో ఎక్కువ భాగం మార్చిలోనే నమోదయ్యే ప్రమాదం ఉందని అంచనా. ఇది వాతావరణ సమాచారం, ఉష్ణోగ్రతల అంచనాలు, గతంలో వేడికి సంబంధించిన మరణాల మధ్య ఉన్న సంబంధాల ఆధారంగా రూపొందించిన నమూనా అంచనా మాత్రమే. వాస్తవంగా ఎంతమంది మరణిస్తారో ఇది కచ్చితంగా చెప్పడం లేదు. ఎల్‌నినో అంటే పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ, వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు వస్తాయి. ఈసారి ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని కొందరు నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) కూడా ఈ ఏడాది ఎల్‌నినో బలంగా ఉందని, డిసెంబర్‌లో గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని హెచ్చరించింది. దీని ప్రభావాలు 2027 ప్రారంభం వరకు కొనసాగవచ్చని అంచనా. కొత్త ట్రాకర్ అంచనాల ప్రకారం.. అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 3.73 లక్షల మరణాలు సంభవించే అవకాశం ఉంది. ఈ ఆరు నెలల కాలంలో నైజీరియాలో 56 వేల మరణాలు, భారత్‌లో 55 వేల మరణాలు సంభవించవచ్చని అంచనా. ఇండోనేషియాలో 29 వేలు, బ్రెజిల్‌లో 19 వేల మరణాలు సంభవించే ప్రమాదం ఉందని ట్రాకర్ పేర్కొంది. అయితే ఈ అంచనాలు మరణాలు తప్పనిసరిగా జరుగుతాయని చెప్పడం లేదు. ముందస్తు హెచ్చరికలు, తాగునీటి సదుపాయాలు, చల్లదనం కల్పించే కేంద్రాలు, బయట పనిచేసే కార్మికులకు రక్షణ, ఆరోగ్య సేవలను మెరుగుపరచడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు.

మహువా మొయిత్రా పిటిషన్ కొట్టివేత

దేశ ఆర్థిక మార్కెట్లలో పెట్టుబడులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్, ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలు, వాటి అసలు లబ్ధిదారుల వివరాలను బహిర్గతం చేయాలని సెబీని ఆదేశించలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ మేరకు ివీజ ఎంపీ మహువా మొయిత్రా దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్, జస్టిస్ డి.కె.ఉపాధ్యాయలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం కొట్టివేసింది. ఒక ఎంపీగా ఈ అంశాన్ని పార్లమెంటులో ఎందుకు లేవనెత్తలేదని, అక్కడ ఎందుకు చర్చ కోరలేదని ధర్మాసనం ప్రశ్నించింది. పెట్టుబడిదారుల వివరాలను బహిర్గతం చేయటానికి ప్రస్తుతం చట్టపరమైన వ్యవస్థ కానీ ఫ్రేమ్‌వర్క్ లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇందుకోసం కోర్టు ఒక కొత్త నియంత్రణ ఫ్రేమ్‌వర్క్‌ను సృష్టించాల్సి ఉంటుందని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద తనకు ఉన్న అధికార పరిధిని ఉపయోగించి కోర్టు అలాంటి పనిని చేయలేదని చెప్పింది. అయినా సెబీకి ఆదేశాలు ఇవ్వొచ్చని పిటిషనర్ తరఫు న్యాయవాదులు తెలిపారు. ఈ ఫండ్స్ వెనక ఉన్న అసలు వ్యక్తులు కంపెనీల షేర్ల విలువను అమాంతం పెంచి అమాయక పెట్టుబడిదారులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అందువల్ల అసలు లబ్ధిదారుల వివరాలు వెల్లడించేలా ఆదేశించాలని కోరారు. కంపెనీల్లో జరుగుతున్న భారీ పెట్టుబడుల వెనుక ఎవరున్నారో తెలుసుకునే హక్కు సాధారణ పెట్టుబడిదారులకు ఉండాలని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా విదేశీ సంస్థల ద్వారా అస్పష్టమైన మార్గాల్లో పెట్టుబడులు వచ్చినప్పుడు ఇది మరింత ముఖ్యమని పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు. అపారదర్శక ఆర్థిక సాధనాల ద్వారా స్టాక్ మార్కెట్‌ను తారుమారు చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సెబీ అనేది సెక్యూరిటీ మార్కెట్లను నియంత్రించే సంస్థ అని, ఏఐఎఫ్, ఎఫ్‌పీఐల కార్యకలాపాలను పర్యవేక్షించడం దాని బాధ్యత అని పేర్కొన్నారు. అయితే, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అంతిమ లబ్ధిదారుల వివరాలను వెల్లడించడం అవసరమని కోర్టు భావిస్తే, మార్కెట్‌లోని పెట్టుబడుల వెనుక ఎవరున్నారో పౌరులు తెలుసుకునేందుకు వీలుగా ఆదేశించవచ్చని భూషణ్ కోర్టుకు చెప్పారు. ఈ సమస్య కేవలం సెబీ వద్ద సమాచారం ఉండటం లేదా లేకపోవడానికి సంబంధించినది మాత్రమే కాదన్నారు. షేర్లను ఎవరు కొనుగోలు చేస్తున్నారు, విక్రయిస్తున్నారు? ఆ పెట్టుబడుల వల్ల అంతిమంగా ఎవరు లబ్ధి పొందుతున్నారు

పొత్తులపై చంద్రబాబు సంచలన నిర్ణయం.. అలా చేస్తే సస్పెన్షనే!

స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి పార్టీల మధ్య పొత్తు ధర్మం కచ్చితంగా అమలయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎన్డీఏ కూటమిలోని పక్షాలన్నీ కలిసికట్టుగా ముందుకు సాగాలని, అభ్యర్థుల గెలుపు కోసం అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎక్కడైనా రెబల్స్ బరిలో ఉంటే వెంటనే సస్పెండ్ చేయాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. మూడు పార్టీల కలిసి నిలబెట్టిన వారే కూటమి అభ్యర్థి అంటూ సీఎం స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయానికి విరుద్ధంగా పోటీ చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని తేల్చిచెప్పారు. రాష్ట్రమంత్రి వర్గ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో మంత్రులు తాజా రాజకీయాలపై చర్చించారు. ప్రస్తుతం మున్సిపల్, జడ్పీ, మండల పరిషత్ ఎన్నికల ప్రచార పర్వం ఎలా సాగుతుందో అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఇంచార్జి మంత్రులు ఆయా జిల్లాల్లో కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా స్థానిక ఎన్నికలలో రెబల్స్ అంశంపై సీఎం, మంత్రులు కూలంకుషంగా చర్చించారు. డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తో కలిసి సీట్ల సర్దుబాటు చేసుకున్నామని సీఎం గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థులను చూసి కాకుండా, ఎన్డీఏ కూటమిని చూసి ప్రజలు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ రెండున్నరేళ్ల కాలంలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో అత్యంత సానుకూల వాతావరణం ఉందని కేబినెట్ అభిప్రాయపడింది.

రెబల్స్ దారిలోకి వస్తారా?

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో రెబల్స్ దారిలోకి వస్తారా? అనే చర్చ జరుగుతోంది. మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వం రేపటితో ముగియనుండగా, 1వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. అదేవిధంగా జడ్పీటీసీ, ఎంపీటీసీలకు నామినేషన్ ఉపసంహరణ గడువు ఇప్పటికే పూర్తయింది.



దీంతో పలుచోట్ల కూటమి సర్దుబాట్లను లెక్కచేయకుండా టీడీపీ నేతలు పోటీ చేస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికే మిత్రపక్షాలకు తక్కువ సీట్లు ఇచ్చారనే అసంతృప్తి నడుమ పార్టీ నేతలు తిరుగుబాటు చేయడంపై సీఎం సీరియస్ గా ఉన్నారని అంటున్నారు. రెబల్స్ విషయంలో మెతక వైఖరి ప్రదర్శిస్తే మిత్రపక్షాలు తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉన్నందున మాట వినని వారిపై వేటు వేయాలని సీఎం స్పష్టమైన వైఖరి తీసుకున్నారని అంటున్నారు. ఇప్పటివరకు ఉన్న చిన్న చిన్న వివాదాలను ఎక్కడికక్కడ పరిష్కరించుకోవాలని చివరి అవకాశం ఇవ్వాలని, లేదంటే సస్పెండ్ చేయాలని తెగేసి చెప్పారని చెబుతున్నారు.

మంత్రులకు ఎన్నికల బాధ్యతలు

ఇక మంత్రులు తమ సొంత నియోజకవర్గాలతో పాటు, ఇంచార్జి బాధ్యతలు చూస్తున్న జిల్లాలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని సీఎం ఆదేశించారు. "అభ్యర్థుల గెలుపు బాధ్యత పూర్తిగా మంత్రులదే" అని స్పష్టం చేశారు. ముందుగా పట్టణ స్థానిక సంస్థలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు పూర్తవుతాయని, ఆ వెంటనే పంచాయతీ ఎన్నికలు, ఆ తర్వాత సొసైటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పట్నుంచే నాయకులు, కేడర్ అన్నింటికీ తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత పూర్తిస్థాయి పాలనపై దృష్టి సారిద్దామని కేబినెట్ సమావేశంలో పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. జనసేన, బీజేపీ నుంచి తలెత్తిన చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, ప్రజలు, కేడర్ నుంచి మంచి సానుకూల స్పందన వస్తోందని వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఎన్డీఏ కూటమి సమన్వయంతో ముందుకు వెళ్తున్న తరుణంలో, రెబల్స్ విషయంలో కఠినంగా వ్యవహరించాలని తీసుకున్న నిర్ణయం ద్వారా కూటమిలో క్రమశిక్షణ మరింత బలపడుతుందని నేతలు భావిస్తున్నారు.

ఓటుకు రూ.3 వేలు.. బొత్స వర్సెస్ కిమిడి పోరు, ఓటర్లకు గరిష్ట ధర!

విజయనగరం జిల్లా చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో స్థానిక ఎన్నికలు రాజకీయ సెగలు పుట్టిస్తున్నాయి. ఈ నియోజకవర్గంలోని గరివిడి మండల జడ్పీటీసీ స్థానానికి సీనియర్ నేతలు కిమిడి కళావెంకటరావు, బొత్స సత్యనారాయణ కోడళ్లు పోటీ పడుతున్నారు. దీంతో గరివిడి జడ్పీటీసీ ఎన్నిక ఇరువురు నేతలకు ప్రతిష్టాత్మకంగా మారిందని అంటున్నారు. కళావెంకటరావు ప్రస్తుతం చీపురుపల్లి ఎమ్మెల్యేగా ఉండగా, బొత్స ఇదే నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రిగా పనిచేశారు. గత ఎన్నికల్లో బొత్సను ఓడించిన కళావెంకటరావు చీపురుపల్లిని సుస్థిరం చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో కోడలిని జడ్పీటీసీగా బరిలో దింపి జడ్పీ చైర్మన్ స్థానాన్ని ఆశిస్తున్నారని అంటున్నారు. ఇదే సమయంలో బొత్స కూడా గత ఎన్నికల్లో ఎదురైన పరాభవానికి సమాధానంగా నియోజకవర్గంలోని నాలుగు స్థానాలు గెలుచుకునే లక్ష్యంతో పావులు కదుపుతున్నారని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇరువురు నేతలు వ్యక్తిగత ప్రతిష్టకు తీసుకుని విజయం కోసం వ్యూహాలు రచిస్తున్నారని చెబుతున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో నాలుగు జడ్పీటీసీలు ఉండగా, ఇందులో రెండు చోట్ల బొత్స కుటుంబం నుంచి కోడలు పూజిత (గరివిడి), చెల్లెలు వెంకటలక్ష్మి (గుర్ల) పోటీ చేస్తున్నారు. ఈ ఇద్దరిలో బొత్స కోడలు పూజిత గెలుపు ఆయనకు వ్యక్తిగతంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా మారిందని అంటున్నారు. దీనికి ప్రధాన కారణం సిట్టింగ్ ఎమ్మెల్యే కళావెంకటరావు కోడలు సంధ్య పోటీ ఉండటమే అంటున్నారు. గరివిడి మండలం తొలి నుంచి టీడీపీకి కంచుకోటగా చెబుతున్నారు. అయితే ఇక్కడ బొత్స వ్యక్తిగత ఇమేజ్ కూడా ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందని అంటున్నారు.గత ఎన్నికల్లో బొత్సపై గెలిచిన ఎమ్మెల్యే కళావెంకటరావు తన గెలుపు గాలివాటం కాదని నిరూపించుకోవాలని భావిస్తున్నారని చెబుతున్నారు. తన సొంత నియోజకవర్గమైన రాజాం ప్రస్తుతం విజయనగరం జిల్లాలో ఉండటం వల్ల తన కుటుంబ రాజకీయ భవిష్యత్తుకు ఈ ఎన్నికలు కీలకం అన్న ఆలోచనలో కళా ఉన్నారని అంటున్నారు. ఇక బొత్స కూడా ఇంచుమించు ఇదే ఆలోచనతో స్థానిక ఎన్నికలపై గట్టిగా ఫోకస్ చేశారని చెబుతున్నారు. గత ఎన్నికల్లో అనూహ్య ఓటమితో డీలా పడిన బొత్స.. ఈ ఎన్నికల ద్వారా తిరిగి పుంజుకోవాలని, చీపురుపల్లి తన కంచుకోటగా నిరూపించుకోవాలని తాపత్రయ పడుతున్నారని చెబుతున్నారు.దీంతో ఇద్దరు సీనియర్ నేతలు ఎత్తుకుపైఎత్తులు వేస్తుండటంతో గరివిడి జడ్పీటీసీ ఎన్నిక హీట్ పుట్టిస్తోందని అంటున్నారు. ఇరువురు నేతలు గెలుపు కోసం ఎంతవరకు అయినా వెళ్లేలా కనిపిస్తుండటంతో ఓటర్లకు మంచి కానుకలు అందుతున్నాయని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగుతున్న ప్రచారం ప్రకారం ఒక్కో ఓటుకు మూడు వేల రూపాయలు అయినా చెల్లించేందుకు ఆయా పార్టీలు సిద్ధమవుతున్నట్లు చెబుతున్నారు. గ్రామాలకు గ్రామాలను కొనేసి ఎన్నికను ఏకపక్షం చేసుకోవాలనే ఆలోచనతో నాయకులు ఉన్నారని అంటున్నారు. దీంతో ఈ నియోజకవర్గంలో ఇంతకు ముందు ఎన్నడూ లేనట్లు ప్రస్తుతం ఓటుకు గరిష్ట రేటు పలుకుతోందని చెబుతున్నారు.

ఏబీవీ ఎఫెక్ట్ ఎంత? : సోషల్ మీడియాలోనే కనిపిస్తున్న హడావుడి

రాష్ట్రంలో అత్యంత రాజకీయ ప్రాధాన్యం ఉన్న విజయవాడ నగర పాలక సంస్థ ఎన్నికలు ఆసక్తి రేపుతున్నాయి. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ఇండిపెండెంటుగా పోటీలోకి దిగడంతో నగర రాజకీయమే మారిపోయిందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఆయనకు మద్దతుగా విద్యావంతులు, రిటైర్డ్ ఐఏఎస్, పోలీసు అధికారులు గళం వినిపిస్తున్నారు. ఇదే సమయంలో ఏబీవీ సైతం సోషల్ మీడియా వేదికగా జోరుగా ప్రచారం చేస్తున్నారు. దీంతో నగరంలో కూటమి వర్సెస్ ఏబీవీ అన్నట్లు రాజకీయం మారిపోయిందని విశ్లేషిస్తున్నారు. అయితే ఇదంతా సోషల్ మీడియా సృష్టి మాత్రమేనని, క్షేత్రస్థాయిలో కూటమి, విపక్షం వైసీపీ మధ్య ముఖాముఖి పోరు మాత్రమే ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. దీనికి కారణంగా డిజిటల్ ప్రచారంలో ఏబీవీ పైచేయి సాధిస్తున్నప్పటికీ, డివిజన్ పర్యటనల్లో జోరు చూపలేకపోవడమే అంటున్నారు.

అంతా డిజిటల్ ప్రచారమే..

స్వతంత్ర అభ్యర్థిగా మేయర్ స్థానానికి పోటీ చేస్తున్న ఏబీవీ తొలి నుంచి సోషల్ మీడియా ప్రచారంలో ముందంజలో ఉన్నారని విశ్లేషిస్తున్నారు. రిటైర్ అయిన నుంచి సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ వివిధ ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నేరుగా ప్రశ్నిస్తున్న ఏబీవీకి ఈ ఎన్నికల్లో ప్రచారం నిమిత్తం డిజిటల్ మీడియా బాగా పనికొచ్చిందని విశ్లేషిస్తున్నారు. అయితే డిజిటల్ మీడియా విస్తృతి ఎక్కువగా ఉండటం, అందులో ఆయన ప్రచారం, అభ్యర్థన విజయవాడ నగర వాసులకు ఎంతవరకు చేరుతుందనే అంశమై ప్రశ్నలు



తలెత్తుతున్నాయని చెబుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడి వారు అయినా డిజిటల్ ప్రచారంపై స్పందించవచ్చునని, కానీ వారు ఓటు వేసే అవకాశం ఉండదనే విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో నేరుగా ప్రచారం చేయడం వల్లే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని పరిశీలకులు సూచిస్తున్నారు.

సమయమే అసలు సమస్య

డిజిటల్ మాధ్యమంలో జోరుగా ప్రచారం చేసుకుంటున్న ఏబీవీ.. ఓటర్లను చేరువయ్యే క్షేత్రస్థాయి పర్యటనల్లో వెనకబడుతున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. నగరం పరిధిలో ఆయన తీరిక లేకుండా పర్యటిస్తున్నా, సమయం తక్కువగా ఉండటం వల్ల ముక్తసరిగా సరిపెట్టాల్సివస్తోందని, అదే సమయంలో తీరిక లేని నగర జనం ఆయన మాటలను వినేందుకు కూడా సరిగా సమయం కేటాయించలేకపోతున్నారని అంటున్నారు. దీనివల్ల ఏబీవీ ప్రచారం ప్రజలకు ఎంతవరకు చేరుతుందనేది ప్రశ్నార్థకంగా మారిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఏబీవీ ఎంతవరకు ప్రభావం చూపగలరనేది హాట్ టాపిక్ అవుతోంది. మేయర్ రేసులో దిగుతున్నట్లు ఏబీవీ ప్రకటించిన వెంటనే ప్రధాన పార్టీలకు ముచ్చెమటలు పట్టాయని అంటున్నారు. అయితే ప్రచార తీరు చూసిన తర్వాత తమకు ఏం నష్టం లేదన్న ధీమా వ్యక్తం చేస్తున్నాయని చెబుతున్నారు.

అసలు వ్యూహం వేరే..

ఇక ఏబీవీ పోటీపై పరిశీలకులు రకరకాలుగా విశ్లేషిస్తున్నారు. మేయర్ గా పోటీ చేయాలన్న ఏబీవీ అనూహ్య నిర్ణయం వెనుక పక్కా రాజకీయ వ్యూహం ఉందని అంటున్నారు. రిటైర్ అయిన తర్వాత తనను నిర్లక్ష్యం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబుపై అసంతృప్తితో రగిలిపోతున్న ఏబీవీ.. తన సామర్థ్యం ఏంటో నిరూపించుకోవడమే కాకుండా, ఆ మేరకు ప్రభుత్వ పెద్దలకు స్పష్టమైన సంకేతం ఇవ్వాలనే ఆలోచనతోనే ఈ ఎన్నికల రంగంలోకి దిగినట్లుగా అనుమానిస్తున్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా తనకు వచ్చే ఓట్లే ప్రాతిపదికగా భవిష్యత్తు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలనే ఆలోచనతో ఏబీవీ రంగంలోకి దిగారని విశ్లేషిస్తున్నారు. ప్రధాన పార్టీలకు దీటుగా ఓట్లు సాధిస్తే విద్యావంతులు, ఉద్యోగుల్లో తన వాదన సరైనదిగా భావించి మరింత దూకుడుగా పనిచేయొచ్చని ఆయన ఆలోచనగా ఉందని, లేనిపక్షంలో తన వైఖరిని పునఃసమీక్షించుకునేలా అడుగులు వేయొచ్చని అంటున్నారు. ఏదిఏమైనా విజయవాడ కార్పొరేషన్ రేసును వ్యూహాత్మకంగా వాడుకోవాలనే ఆలోచనతోనే ఏబీవీ ఉన్నారని చెబుతున్నారు.

పోలవరం ప్రాజెక్టులో మరో కీలక మైలురాయి..

90.1 శాతం ఫిజికల్ ప్రోగ్రెస్

ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం శరవేగంగా సాగుతుంది. తాజాగా పోలవరం ప్రాజెక్టు మరో ప్రధాన మైలురాయిని చేరుకుంది. సెప్టెంబర్ నాటికి ఈ ప్రాజెక్టు మొత్తం నిర్మాణంలో 90.1 శాతంఫిజికల్ ప్రోగ్రెస్ సాధించగా, మొదటి విడత కింద 78 శాతం పనులు పూర్తైనట్లు అధికారులు తెలిపారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నీటి వనరుల శాఖ కార్యదర్శి అధ్యక్షతన అక్టోబర్ 12నజరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో సమర్పించిన నివేదిక ప్రకారం ప్రాజెక్టుకు సంబంధించిన హెడ్‌వర్క్స్, ప్రధాన కాలువల పనులు తుది దశకు చేరుకున్నాయి.

స్పిల్‌వే, గ్యాప్-3లో మెయిన్ డ్యామ్, గ్యాప్-1, 2లలో డయాఫ్రమ్ వాల్స్, అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ కాఫర్ డ్యామ్‌లు, అప్‌స్ట్రీమ్ కాఫర్ డ్యామ్ బట్రెస్, కుడి కాలువ పనులు వంద శాతం పూర్తయ్యాయి.

సివిల్ పనుల్లో 88 శాతం ఆర్థిక పురోగతి, భూసేకరణలో 95.6 శాతం పూర్తైందని నివేదిక తెలిపింది. అయితే, నిర్వాసితుల పునరావాసం, పునర్నిర్మాణం పనులు ప్రస్తుతం 51.9 శాతం వద్దఉండటంతో, ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడానికి అధికారులు దీనిపై దృష్టి సారించారు. ఆగస్టు 28, 2024న కేంద్ర క్యాబినెట్ ఫేజ్-1 వ్యయం రూ. 30,436.95 కోట్లకు సవరించి ఆమోదంతెలిపింది. అనంతరం కేంద్ర ప్రభుత్వం నుండి ప్రాజెక్టుకు నిరంతరంగా ఆర్థిక సహాయం అందుతోంది. ఏప్రిల్ 1, 2014 నుండి ఇప్పటివరకు కేంద్రం రూ. 23,485.31 కోట్లను విడుదల చేసింది.ఇందులో నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసేందుకు 2024--25, 2025--26 సంవత్సరాలకు గానూ రూ. 7,862.93 కోట్ల ముందస్తు గ్రాంట్ మంజూరు చేసింది. పోలవరం ప్రాజెక్టుపూర్తి చేయడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశాయి. డిసెంబర్ 2026 నాటికి ప్రాజెక్టు ప్రాథమిక కనెక్టివిటీ పనులన్నీ పూర్తి చేయనున్నారు. మార్చి 2027 నాటికిగ్యాప్-1లోని ఎర్త్-కమ్-రాక్-ఫిల్ డ్యామ్ ఎంబ్యాంక్‌మెంట్ పనులు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. జూన్ 2027 నాటికి గ్యాప్-2 ఎంబ్యాంక్‌మెంట్ పనులతో పాటు స్కాడా కంట్రోల్ బిల్డింగ్,ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్లు, యాక్సెస్ రోడ్లు, స్లోప్ ప్రొటెక్షన్ పనులు పూర్తి చేసి ప్రాజెక్టును రెడీ చేయనున్నారు.

నాదెండ్ల మనోహర్ వైపే గురి....

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో , ముఖ్యంగా డిజిటల్ స్పేస్‌లో ప్రస్తుతం తీవ్రమైన చర్చకు దారితీస్తున్న అంశం జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ లక్ష్యంగా సాగుతున్నసోషల్ మీడియా దాడులు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొంతమంది జనసేన సానుభూతిపరులు, అభిమానులు , శ్రేణులు అని చెప్పుకునే నెటిజన్లు నేరుగా నాదెండ్ల మనోహర్‌ను టార్గెట్ చేస్తూ.. ఆయనపార్టీ బాధ్యతల నుంచి తప్పుకోవాలని, లేదా ఆయనను పక్కన పెట్టాలని పోస్టులు పెట్టడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. గతంలో అనేక సందర్భాల్లో జనసేనాని పవన్ కళ్యాణ్ స్పందిస్తూ నాదెండ్లమనోహర్‌ను ఏమైనా అంటే నన్ను అన్నట్లే, పార్టీ కష్టకాలంలో నిలబడిన శ్రేయోభిలాషి ఆయన అని బహిరంగ వేదికలపై స్పష్టమైన హామీ ఇచ్చినా కూడా.. ఈ ప్రచారం తగ్గకపోవడం వెనుక పెద్ద పొలిటికల్‌స్కిట్ నడుస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.నిజానికి, 2019 ఘోర పరాజయం తర్వాత జనసేన ఉనికిని కాపాడుకోవడంలో, క్షేత్రస్థాయిలో పార్టీకి ఒక బలమైన ఆర్గనైజేషనల్ స్ట్రక్చర్‌తీసుకురావడంలో నాదెండ్ల మనోహర్ పాత్రను ఎవరూ కాదనలేరు. మాజీ స్పీకర్‌గా ఆయనకున్న రాజకీయ అనుభవం, లీగల్ , అడ్మినిస్ట్రేటివ్ పరిజ్ఞానం పవన్ కళ్యాణ్‌కు ఎంతో ఉపకరించాయి. పార్టీనాయకులు కార్యకర్తలను సమన్వయం చేయడం, పొత్తుల చర్చల సమయంలో టీడీపీ-బీజేపీ అగ్రనేతలతో సంప్రదింపులు జరపడం వంటి క్లిష్టమైన బాధ్యతలను నాదెండ్ల ఎంతో సైలెంట్‌గా నిర్వర్తించారు.అలాంటి వ్యూహకర్తను ఇప్పుడు ఉన్నపలంగా సొంత పార్టీకి చెందిన నెటిజన్లే నిందించడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటనేది ప్రధాన ప్రశ్నగా మారింది.ఈ టార్గెటింగ్ వెనుక మొదటి ప్రధాన కారణం.. సీట్లకేటాయింపులు , స్థానిక సంస్థల టికెట్ల అసంతృప్తి . కూటమి ప్రభుత్వంలో జనసేన 21 అసెంబ్లీ స్థానాల్లో 100% స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించినప్పటికీ, స్థానిక ఎన్నికల్లో పొత్తుల కారణంగా అనేకమందిక్షేత్రస్థాయి నేతలకు, పోటీ చేయాలనుకున్న ఆశావహులకు సీట్లు దక్కలేదు. మున్సిపల్, పంచాయతీ, పరిషత్ ఎన్నికలలో కూడా సీట్ల కేటాయింపుల బాధ్యత నాదెండ్ల మనోహర్ నేతృత్వంలోని పిఏసిసమీక్షిస్తుండటంతో.. అవకాశాలు రాని ఆశావహులు తమ కోపాన్ని పవన్ కళ్యాణ్‌పై చూపించలేక, ఆయనకు కుడి భుజంగా ఉన్న నాదెండ్లపైకి మళ్లిస్తున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. పవన్ కళ్యాణ్‌నుకలవడానికి లేదా ఆయన వరకు తమ ప్రతిపాదనలు తీసుకెళ్లడానికి నాదెండ్ల మనోహర్ ఒక పెద్ద అడ్డంకిగా మారారని, ఆయన అనుమతి లేనిదే అధినేతను కలిసే అవకాశం దక్కడం లేదని ద్వితీయ శ్రేణినేతలలో కొంత అసహనం ఉంది. రాజకీయాల్లో పార్టీ అధినేత చుట్టూ ఉండే రక్షణ కవచం వంటి నేతలే ఎప్పుడూ క్యాడర్ ఆగ్రహానికి మొదటి బాధితులవుతుంటారు. ఈ క్రమంలోనే పవన్ కంటే ముందునాదెండ్ల విమర్శల దాడికి గురవుతున్నారు.విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రత్యర్థులు జనసేనను సంస్థాగతంగా బలహీనపరచడానికి డివైడ్ అండ్ రూల్ వ్యూహాన్ని అమలు చేస్తున్నాయనే కోణాన్నితోసిపుచ్చలేం. నాదెండ్ల మనోహర్‌ను సామాజిక వర్గపరంగా, అలాగే రైట్ హ్యాండ్ స్థానం నుంచి వేరు చేయగలిగితే.. పవన్ కళ్యాణ్ చుట్టూ ఉన్న పరిపాలనా వ్యవస్థ, సమన్వయం దెబ్బతింటుందనేదిప్రత్యర్థుల ఆలోచన అయి ఉండవచ్చు. సోషల్ మీడియాలో డమ్మీ ప్రొఫైల్స్ ద్వారా జనసేన కార్యకర్తల పేరిట నాదెండ్లపై నెగెటివ్ ప్రచారం చేయించడం ఈ మైండ్ గేమ్‌లో భాగమని భావిస్తున్నారు. అసలునాదెండ్ల మనోహర్‌ను పార్టీకి దూరం చేస్తే లేదా ప్రాధాన్యత తగ్గిస్తే ఎవరికి లాభం.. ప్రథమంగా, ఇది జనసేనకు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుంది. పవన్ కళ్యాణ్ పూర్తిస్థాయి డిప్యూటీ సీఎంగా నిరంతరం బిజీగాఉండే సమయంలో పార్టీ రోజువారీ వ్యవహారాలు చూసే అనుభవజ్ఞుడైన అడ్మినిస్ట్రేటివ్ ఫేస్ కరువవుతుంది. రెండవది, కూటమి భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, బీజేపీలతో సత్సంబంధాలు నెరపే సమన్వయకర్తతగ్గిపోతారు. ప్రత్యర్థులకు ఇది చాలా పెద్ద విజయం కాగా, జనసేనలోని కొన్ని అసంతృప్తి వర్గాలకు తాత్కాలిక సంతోషాన్ని ఇవ్వవచ్చు. సోషల్ మీడియా ట్రోలింగ్స్ , అసంతృప్తులు రాజకీయాల్లో సహజమేఅయినప్పటికీ, నాదెండ్ల మనోహర్ లాంటి సీనియర్ నాయకుడి విషయంలో క్రమశిక్షణ తప్పడం పార్టీకి నష్టం కలిగిస్తుంది. పవన్ కళ్యాణ్ స్వయంగా రంగంలోకి దిగి తన స్పష్టమైన సందేశాన్ని మళ్లీ శ్రేణులకుఅందిస్తే తప్ప, నాదెండ్లపై సాగుతున్న ఈ డిజిటల్ ప్రచారానికి తెరపడకపోవచ్చు

స్థానిక ఎన్నికల వేళ టీడీపీలో అంతర్గత సెగ..

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం తుది దశకు చేరుకుంటున్న వేళ కూటమి పార్టీల్లో అంతర్గత విభేదాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు, స్థానిక నాయకులకు మధ్య కొనసాగుతున్న అసంతృప్తి ఎన్నికలపై ప్రభావం చూపించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని కొందరు నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, ఎన్నికల సమయంలో సహకరించకపోవడం పార్టీ విజయావకాశాలను దెబ్బతీస్తుందని ఎమ్మెల్యే వర్గాలు భావిస్తున్నాయి. నవంబరు 1న జరగనున్న మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికలనేపథ్యంలో ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.తెలుగుదేశం పార్టీ లో కొన్ని ప్రాంతాల్లో స్థానిక నాయకులు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లోచర్చ జరుగుతోంది. ఎమ్మెల్యేలు తమకు సంబంధించిన నాయకులకే ప్రాధాన్యం ఇస్తున్నారని, ఇతర వర్గాలను పట్టించుకోవడం లేదని అసంతృప్తితో ఉన్న నేతలు ఆరోపిస్తున్నట్లు సమాచారం. దీంతోఅధికారిక అభ్యర్థులకు ప్రచారంలో అవసరమైన సహకారం అందడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. మరోవైపు, ఎన్నికల సమయంలో అందరూ పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేయాలని ఎమ్మెల్యేలుతమ అనుచరులకు సూచిస్తున్నట్లు తెలుస్తోంది.ఆళ్లగడ్డ నియోజకవర్గంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ కు, స్థానికంగా ఉన్న కొన్ని నాయకుల వర్గాలకు మధ్య విభేదాలు ఉన్నాయనే ప్రచారంరాజకీయంగా చర్చకు దారితీసింది. ఆమెకు సన్నిహితంగా ఉన్న నాయకులకు కొందరు స్థానిక నేతలు సహకరించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకుకూడా కొన్ని వర్గాల నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు లభించడం లేదనే చర్చ సాగుతోంది. అయితే ఈ పరిణామాలపై సంబంధిత నాయకుల అధికారిక స్పందనలు, పూర్తి వివరాలు వెలువడాల్సిఉంది.మున్సిపల్ చైర్మన్, మేయర్ పదవులను ఆశించిన నాయకులకు అవకాశం దక్కకపోవడం కూడా అసంతృప్తికి కారణమవుతోంది. కొన్ని ప్రాంతాల్లో తెలుగుదేశం నాయకులు, వారి కుటుంబ సభ్యులుపదవులను ఆశించగా, పొత్తులో భాగంగా ఆ స్థానాలు జనసేన , భారతీయ జనతా పార్టీ అభ్యర్థులకు కేటాయించినట్లు తెలుస్తోంది. మరికొన్ని చోట్ల పార్టీ కోసం పనిచేసినప్పటికీ తమకు అవకాశం రాలేదనిభావిస్తున్న నేతలు ప్రచారానికి దూరంగా ఉంటున్నారనే వార్తలు వస్తున్నాయి. పార్టీ అధిష్ఠానం నుంచి సూచనలు వచ్చినా, బుజ్జగింపు ప్రయత్నాలు సాగుతున్నా అసంతృప్తి పూర్తిగా తగ్గడం లేదనేఅభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.విజయవాడ, విజయనగరం , కర్నూలు, అనంతపురం, చిత్తూరు వంటి నగరాల్లో స్థానిక నాయకుల మధ్య సమన్వయం ఎన్నికల ఫలితాలకు కీలకంగా మారే అవకాశంఉంది. అభ్యర్థులకు క్షేత్రస్థాయిలో కార్యకర్తల మద్దతు లభించకపోతే ప్రచార ప్రభావం తగ్గే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకత్వం పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, విభేదాలనుపరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అసంతృప్త నేతలకు నామినేటెడ్ పదవులు కల్పించడం ద్వారా వారిని పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా భాగస్వాములను చేసే ఆలోచన కూడా చర్చలో ఉంది.చివరి దశ ప్రచారంలో అసంతృప్తులను ఎంతవరకు సమన్వయం చేయగలరన్నది ఇప్పుడు కీలకంగా మారింది. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు కలిసిపనిచేస్తారా? లేక అంతర్గత పోరు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతుందా? అన్నది నవంబరు 1న జరిగే ఎన్నికలతో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

బిజినెస్

పరీక్ష సమయంలో సైబర్ దాడికి పాల్పడిన చైనా ఏఐ మోడల్!

ఏఐ సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ప్రపంచ దేశాలను కలవరపెట్టే ఒక సంచలన వార్త వెలుగులోకి వచ్చింది. ప్రముఖ చైనా ఏఐ సంస్థకు చెందిన ఫ్లాగ్‌షిప్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్.. నియంత్రిత పరీక్షా సిమ్యులేషన్లలో అత్యంత సంక్లిష్టమైన సైబర్ దాడిని విజయవంతంగా నిర్వహించినట్లు పరిశోధకులు వెల్లడించారు. అంతేకాకుండా ఈ ప్రయోగాల సమయంలో ఆ మోడల్ పదేపదే భద్రతా నిబంధనలను, ఆదేశాలను బేఖాతరు చేసినట్లు తేలింది. ఇది భవిష్యత్తులో డిజిటల్ భద్రతకు పెనుముప్పుగా పరిణమించే అవకాశం ఉందన్న ఆందోళనలను వ్యక్తం చేస్తోంది.

నియంత్రిత పరీక్షల్లో ఏం జరిగింది?

టెక్నాలజీ రంగంలో నూతన ఆవిష్కరణలు జరుగుతున్నప్పటికీ వాటివల్ల కలిగే దుష్పరిణామాలపై నిపుణులు ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతారు. ఇందులో భాగంగానే చేపట్టిన కంట్రోల్డ్ టెస్టింగ్ (నియంత్రిత పరీక్షలు) సమయంలో చైనాకు చెందిన జెడ్.ఏఐ సంస్థకు చెందిన ఏఐ మోడల్ ప్రవర్తన పరిశోధకులను విస్మయానికి గురిచేసింది. మనుషుల ప్రమేయం లేకుండానే స్వయంగా నిర్ణయాలు తీసుకోగల ఈ మోడల్ డిజిటల్ నెట్‌వర్క్‌లలోని లోపాలను ఆసరాగా చేసుకొని కాంప్లెక్స్ సైబర్ దాడికి పాల్పడింది. అత్యంత కఠినమైన భద్రతా వలయాలు, నిబంధనల మధ్య నిర్వహించిన ఈ పరీక్షల్లో ఇచ్చిన ఆదేశాలను పాటించకుండా తనంతట తానుగా వ్యవహరించడం టెక్ వర్గాల్లో కలవరం రేపుతోంది.

భద్రతా నిపుణుల ఆందోళనలు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నమూనాలు వేగంగా పరిపక్వత చెందుతుండటం, ఓపెన్-వెయిట్ ఆర్కిటెక్చర్‌ల ద్వారా వాటిని ఎవరైనా సులభంగా డౌన్‌లోడ్ చేసుకుని తమ అవసరాలకు తగ్గట్టు మార్చుకునే అవకాశం ఉండటం సైబర్ సెక్యూరిటీకి సవాల్‌గా మారుతోంది. కొన్ని సందర్భాల్లో ఈ ఏఐ టూల్స్ కోడ్ విశ్లేషణ, ఎర్రర్‌లను గుర్తించడంలో ఎంత వేగంగా పనిచేస్తున్నాయో, అదే స్థాయిలో సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కితే విధ్వంసం సృష్టించడంలోనూ అంతే ప్రమాదకరంగా మారుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వడ్డీరేట్లను యథాతథంగా ఉంచిన అమెరికా కేంద్ర బ్యాంక్..!

అగ్రరాజ్యం అమెరికాలో ద్రవ్యోల్బణం ఆందోళనకరస్థాయిలో కొనసాగుతున్నప్పటికీ.. ఆ దేశ కేంద్ర బ్యాంక్ అయిన ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచింది. అమెరికా మధ్యంతర ఎన్నికల ముందు ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. రెండు రోజులపాటు జరిగిన పాలసీ సమావేశం అనంతరం.. వడ్డీ రేట్లను 3.75% నుంచి 4.00% శ్రేణిలోనే కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. భవిష్యత్తులో అనుసరించాల్సిన విధానాలపై స్పష్టత కోసం ఇంకొంత సమాచారాన్ని విశ్లేషించాల్సి ఉందని, అందుకే ఈసారి పెంపునకు విరామం ఇస్తున్నామని తెలిపింది. ద్రవ్యోల్బణం ఇంకా అధిక స్థాయిలోనే ఉందని ఫెడ్ తన ప్రకటనలో పేర్కొన్నది. వడ్డీ రేట్ల పెంపును నిలిపివేయడంవల్ల మరిన్ని వివరాలను సేకరించి విశ్లేషించేందుకు అవకాశం లభిస్తుందని తెలిపింది. ద్రవ్యోల్బణాన్ని తిరిగి రెండు శాతం లక్ష్యానికి సకాలంలో చేర్చేందుకు ఎలాంటి విధానాలు అవసరమో నిర్ధారించడానికి ఈ సమాచారం ఉపయోగపడుతుందని పేర్కొన్నది. అమెరికాలో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు వడ్డీరేట్లను పెంచడం లేదా తగ్గించడం వంటి నిర్ణయాలను ఫెడ్ తీసుకుంటుంది. వడ్డీరేట్ల పెంపు ద్వారా రుణాలను, ఖర్చులను తగ్గించి ధరల పెరుగుదలకు అడ్డుకట్ట వేస్తుంది. గత నెలలోనే ఫెడ్ చైర్మన్ కెవిన్ వార్ష్ నేతృత్వంలోని కమిటీ.. మూడేళ్లలో తొలిసారిగా వడ్డీ రేట్లను పెంచింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రేట్లను తగ్గించాలని డిమాండ్ చేసినప్పటికీ ద్రవ్యోల్బణాన్ని కట్టడిచేసే లక్ష్యంతో ఫెడ్ ఈ నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ నెలలో అమెరికాలో వినియోగదారుల ధరలు గత ఏడాదితో పోలిస్తే 3.7% పెరిగాయి. ఇరాన్ యుద్ధానికి ముందు ఫిబ్రవరిలో ఇది కేవలం 2.4% గానే ఉంది. యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ ఇది ప్రపంచ ఈక్విటీ మార్కెట్లకు సానుకూల సంకేతం కాదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. కర్మ క్యాపిటల్ పోర్ట్‌ఫోలియో మేనేజర్ థామస్ ప్రిజు మాట్లాడుతూ.. ఫెడ్ రేట్లను మార్చకపోవడం సానుకూలంగా కనిపించినా, ఇది తాత్కాలిక విరామం మాత్రమే కావచ్చునని అభిప్రాయపడ్డారు. ఫెడ్ పాలసీ కమిటీలో జరిగిన ఓటింగ్‌లో 10–2 తేడాతో ఈ నిర్ణయం తీసుకున్నారని, ఇద్దరు సభ్యులు 25 బేసిస్ పాయింట్ల పెంపునకు మొగ్గు చూపారని తెలిపారు. ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కమిటీలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయని ఇది స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు. భారత ఈక్విటీ మార్కెట్లపై దీని ప్రభావం గణనీయంగా ఉండవచ్చని ఆయన అంచనా వేశారు. భవిష్యత్తులో అమెరికా వడ్డీ రేట్లను పెంచితే యూఎస్ బాండ్ ఈల్డ్స్, డాలర్ విలువ మరింత పెరుగుతాయని థామస్ ప్రిజు తెలిపారు. దీనివల్ల భారత్ వంటి వర్ధమాన దేశాల మార్కెట్లలోకి వచ్చే విదేశీ పెట్టుబడుల ప్రవాహంపై ఒత్తిడి పెరుగుతుందని, ఫలితంగా నిఫ్టీలో ఒడిదొడుకులు తీవ్రమవుతాయని అన్నారు. ముఖ్యంగా అధిక వ్యాల్యుయేషన్ ఉన్న స్టాక్స్, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులపై ఎక్కువగా ఆధారపడిన రంగాల షేర్లు ప్రపంచ ద్రవ్యలభ్యత పరిస్థితుల్లో మార్పులకు సున్నితంగా ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని థామస్ ప్రిజు హెచ్చరించారు.

అమాంతం పడిపోయిన గూగుల్ షేర్లు.. రూ.26 లక్షల కోట్లు ఆవిరి

ఇంటర్నెట్‌డెస్క్: టెక్ దిగ్గజం గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ షేర్లు అమాంతం క్షీణించాయి బుధవారం (అమెరికా కాలమానం ప్రకారం) ట్రేడింగ్ ప్రారంభమైన కొన్ని గంటల్లోనే 11 శాతం వరకు పడ్డాయి. ఏఐ సేవలకు భారీగా డిమాండ్ ఉన్నప్పటికీ.. పెట్టుబడి నష్టాలు, పెరుగుతున్న ఖర్చులతో మదుపర్లకు లాభాలు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. దాంతో ఆల్ఫాబెట్ త్రైమాసిక ఫలితాలు వాల్‌స్ట్రీట్ అంచనాలను అందుకోలేకపోయాయి. ఫలితంగా అమెరికా మార్కెట్లలో ఆల్ఫాబెట్ షేర్లు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్నాయి. కంపెనీ మార్కెట్ విలువలో 280 బిలియన్ డాలర్ల సంపద ఆవిరయింది. అంటే భారత కరెన్సీలో ఆ మొత్తం దాదాపు రూ.26 లక్షలకోట్లు మూడో త్రైమాసికంలో ఆల్ఫాబెట్‌కు గూగుల్ క్లౌడ్ విభాగం నుంచి వచ్చిన ఆదాయం 30.7 బిలియన్ల డాలర్లకు చేరింది. గూగుల్ సెర్చ్, యూట్యూబ్ విభాగాల ఆదాయంలో వృద్ధి ఆశించిన స్థాయిలో లేకపోయినా.. క్లౌడ్ ఆదాయంతో సర్దుబాటు అయ్యింది. అయితే, ఈ ఫలితాలు పెట్టుబడిదారులను మాత్రం

మెప్పించలేపోకపోయాయి. కంపెనీ మొత్తం ఆదాయంలో వృద్ధి కనిపించినా.. నికర లాభాలు, ఒక్కో షేర్‌పై వచ్చే లాభం అంచనాల కంటే తక్కువగా నమోదయ్యాయి. ఏఐ, క్లౌడ్ సదుపాయాలను విస్తరించేందుకు ఆల్ఫాబెట్ భారీగా ఖర్చుచేస్తోంది. దాంతో నగదు లభ్యత తగ్గిపోవడం పెట్టుబడిదారుల్లో ఆందోళన కలిగిస్తోంది. అలాగే పెట్టుబడులకు తగ్గట్టుగా సమీపకాలంలో లాభాలు వస్తాయా..? అనే అనుమానాల కారణంగా షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది.

అత్యంత విలువైన ఐపీఎల్ ఫ్రాంచైజీగా ముంబై.. ప్రతి ఫ్రాంచైజీ విలువ రూ.14,000 కోట్లకు పైనే!

అత్యంత విలువైన ఐపీఎల్ ఫ్రాంచైజీగా రూ.20,000 కోట్లతో ముంబై ఇండియన్స్

ప్రతి ఐపీఎల్ జట్టు విలువ 1.5 బిలియన్ డాలర్లకు పైమాటే

విలువలో ముంబై తర్వాత స్థానాల్లో ఆర్సీబీ, చెన్నై సూపర్ కింగ్స్

వృద్ధి రేటులో అమెరికా ఎన్ఎఫ్ఎల్, ఎన్బీఏ లీగ్‌లను అధిగమించిన ఐపీఎల్

ఫ్రాంచైజీల ప్రధాన ఆదాయ వనరు బీసీసీఐ మీడియా హక్కుల వాటా

ప్రపంచ క్రీడా యవనికపై ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది. తాజాగా స్పోర్టికో నివేదిక ప్రకారం, ముంబై ఇండియన్స్ (ఎంఐ) ఫ్రాంచైజీ 2.1 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 20,008 కోట్లు) అద్భుతమైన విలువతో ప్రపంచంలోనే అత్యంత విలువైన ఐపీఎల్ జట్టుగా అగ్రస్థానంలో నిలిచింది. ఈ నివేదిక ప్రకారం.. ఐపీఎల్‌లోని ప్రతి ఫ్రాంచైజీ విలువ ఇప్పుడు కనీసం 1.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 14,292 కోట్లు) మార్కును దాటడం విశేషం.

విలువ పరంగా ముంబై ఇండియన్స్ తర్వాత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 1.85 బిలియన్ డాలర్లతో (రూ. 17,626 కోట్లు) రెండో స్థానంలో, చెన్నై సూపర్ కింగ్స్ 1.75 బిలియన్ డాలర్లతో (రూ. 16,674 కోట్లు) మూడో స్థానంలో నిలిచాయి. కోల్‌కతా నైట్ రైడర్స్ 1.73 బిలియన్ డాలర్లతో నాలుగో స్థానంలో ఉండగా, ఢిల్లీ క్యాపిటల్స్ 1.7 బిలియన్ డాలర్లతో లీగ్ సగటు విలువకు సమానంగా ఉంది. మిగతా జట్లలో రాజస్థాన్ రాయల్స్ (1.65 బిలియన్ డాలర్లు), సన్‌రైజర్స్ హైదరాబాద్ (1.62 బిలియన్ డాలర్లు), గుజరాత్ టైటాన్స్ (1.58 బిలియన్ డాలర్లు), పంజాబ్ కింగ్స్ (1.53 బిలియన్ డాలర్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. 2008లో ఐపీఎల్ ప్రారంభమైన నాటి నుంచి ఫ్రాంచైజీల విలువలో అసాధారణ వృద్ధి నమోదైంది. గత 18 ఏళ్లలో లీగ్ ఫ్రాంచైజీల విలువ ఏకంగా 1,800% పెరిగింది. ఇదే సమయంలో అమెరికాకు చెందిన ప్రముఖ స్పోర్ట్స్ లీగ్‌లైన ఎన్ఎఫ్ఎల్ (800%), ఎన్బీఏ (1700% లోపు) వృద్ధి రేటు కంటే ఇది చాలా ఎక్కువ కావడం విశేషం. ముంబై ఇండియన్స్ విలువ కొన్ని నార్త్ అమెరికన్ స్పోర్ట్స్ ఫ్రాంచైజీలైన డెట్రాయిట్ టైగర్స్, వాంకోవర్ కానక్స్ కంటే అధికంగా ఉండటం ఐపీఎల్ బ్రాండ్ బలాన్ని సూచిస్తోంది.

ఫ్రాంచైజీలకు ఆదాయం ఎలా వస్తుంది?

ఐపీఎల్ జట్లకు ప్రధాన ఆదాయ వనరు బీసీసీఐ నుంచి వచ్చే సెంట్రల్ రెవెన్యూ పూల్. ముఖ్యంగా బ్రాడ్‌కాస్ట్, డిజిటల్ మీడియా హక్కుల ద్వారా బీసీసీఐకి భారీ ఆదాయం సమకూరుతుంది. ఇందులో సగం వాటాను బోర్డు ఉంచుకుని, మిగిలిన మొత్తంలో దాదాపు 90% అన్ని ఫ్రాంచైజీలకు సమానంగా పంచుతుంది. మరో 10% జట్ల ప్రదర్శన ఆధారంగా లభిస్తుంది. దీని ద్వారా ప్రతి ఫ్రాంచైజీకి ఏటా సుమారు 50–55 మిలియన్ డాలర్లు (రూ. 476 కోట్ల నుంచి రూ. 523 కోట్ల వరకు) అందుతాయి. ఇది కాకుండా టికెట్ల అమ్మకాలు, స్పాన్సర్‌షిప్‌లు, వాణిజ్య భాగస్వామ్యాల ద్వారా కూడా జట్లు అదనపు ఆదాయాన్ని పొందుతాయి. వేలంలో ఆటగాళ్ల జీతాలపై పరిమితులు ఉండటం, నిర్వహణ ఖర్చులు తక్కువగా ఉండటంతో ఫ్రాంచైజీలు భారీ లాభాలను ఆర్జిస్తున్నాయి. కొన్ని జట్ల లాభాల మార్జిన్ 30% దాటుతుండటంతో ఐపీఎల్ ఫ్రాంచైజీలు ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడులుగా మారాయి.

ఒత్తిడి బౌలర్‌కే, నాకు కాదు.. తొలి బంతి నుంచీ బాదడమే: తిలక్ వర్మ

భారత టీ20 జట్టు వైస్ కెప్టెన్ తిలక్ వర్మ తన కొత్త బ్యాటింగ్ పాత్రపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. గతంలో మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన తాను, ప్రస్తుతం జట్టు అవసరాల రీత్యా ఐదు లేదా ఆరో స్థానంలో ఫినిషర్‌గా వస్తున్నానని, దీనివల్ల తన ఆలోచనా విధానం, ఆటతీరు పూర్తిగా మారాయని తెలిపాడు. న్యూజిలాండ్‌తో నాలుగో టీ20కి ముందు తిలక్ మీడియాతో మాట్లాడాడు. "గతంలో మూడో స్థానంలో ఆడేటప్పుడు క్రీజులో కుదురుకోవడానికి కొంత సమయం తీసుకునేవాడిని. కానీ ఇప్పుడు ఐదు, ఆరు స్థానాల్లో వస్తుండటంతో, వీలుంటే తొలి బంతి నుంచే బౌండరీ కొట్టాలని ఆలోచిస్తున్నా. లేదంటే, మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లడంపై దృష్టి పెడతాను. మొదట్లో సింగిల్స్, డబుల్స్ తీస్తూ, గ్యాప్స్‌లో ఫోర్లు కొట్టే ప్రయత్నం చేస్తాను" అని తిలక్ వర్మ వివరించాడు. తనలో పవర్ గేమ్ ఎప్పుడూ ఉందని, అయితే కొత్త పాత్రకు అనుగుణంగా మారానని చెప్పాడు. న్యూజిలాండ్‌తో రెండో టీ20లో కేవలం 26 బంతుల్లో 51 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించడంపై తిలక్ స్పందించాడు. "డెత్ ఓవర్లలో బ్యాటర్‌గా నా కంటే బౌలర్‌పైనే ఎక్కువ ఒత్తిడి ఉంటుంది. ఆ సానుకూల దృక్పథం నా మదిలో ఎప్పుడూ ఉంటుంది. ఒత్తిడిలో ఉన్న బౌలర్ కచ్చితంగా పరుగులు ఇస్తాడని నమ్ముతాను" అని అన్నాడు. ఆ మ్యాచ్‌లో నితీశ్ రెడ్డితో కలిసి ఏడో వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన విషయాన్ని గుర్తుచేసుకున్నాడు. "మనం ఇక్కడి నుంచి మ్యాచ్ గెలిపిస్తే ఆ మజానే వేరుగా ఉంటుంది. చివరి వరకు ఉండి చూద్దాం అని నితీశ్‌తో చెప్పాను" అని తెలిపాడు. వెస్టిండీస్‌తో సిరీస్ ముగిసిన వెంటనే న్యూజిలాండ్‌కు రావడంతో అక్కడి పరిస్థితులకు, టైమ్ జోన్‌కు అలవాటు పడటం సులువు కాదని, కానీ అంతర్జాతీయ స్థాయిలో ఉన్నప్పుడు సాకులు చెప్పకూడదని తిలక్ అన్నాడు. "గౌతమ్ గంభీర్ సర్ సమావేశంలో స్పష్టంగా చెప్పారు. ఇది సుదీర్ఘ పర్యటన అని, టీ20 జట్టుగా మనం నిర్దేశించే ప్రమాణాలు వన్డే, టెస్ట్ జట్లకు ఊపునిస్తాయని అన్నారు"

స్పోర్ట్స్

ముంబై ఇండియన్స్‌లో భారీ ప్రక్షాళన.. కోచింగ్ బృందం నుంచి మలింగ ఔట్!

ముంబై ఇండియన్స్ కోచింగ్ బృందం నుంచి మలింగ, మాంబ్రే, హాప్‌కిన్‌సన్ తొలగింపు

కొత్త హెడ్ కోచ్‌గా పొలార్డ్ నియామకం తర్వాత కీలక మార్పులు

ఆటగాడిగా, కోచ్‌గా ముంబైతో మలింగకు ఉన్న సుదీర్ఘ అనుబంధం ముగింపు

భారత జట్టు మాజీ బౌలింగ్ కోచ్ పరాస్ మాంబ్రే కూడా వీడ్కోలు

ఐపీఎల్ 2027 సీజన్ కోసం సహాయక సిబ్బందిని పునర్వ్యవస్థీకరిస్తున్న ఫ్రాంచైజీ

ఐపీఎల్ చరిత్రలో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ తమ కోచింగ్ సిబ్బందిలో భారీ మార్పులు చేస్తున్నట్లు గురువారం ప్రకటించింది. బౌలింగ్ కోచ్‌లైన లసిత్ మలింగ, పరాస్ మాంబ్రేతో పాటు ఫీల్డింగ్ కోచ్ కార్ల్ హాప్‌కిన్‌సన్ జట్టును వీడుతున్నట్లు తెలిపింది. మహేల జయవర్ధనే స్థానంలో కీరన్ పొలార్డ్ కొత్త హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ముంబై ఇండియన్స్ చరిత్రలో అత్యంత ఐకానిక్ ఆటగాళ్లలో ఒకరిగా గుర్తింపు పొందిన మలింగ నిష్క్రమణతో ఒక శకం ముగిసినట్లయింది. శ్రీలంకకు చెందిన ఈ దిగ్గజ ఫాస్ట్ బౌలర్, ముంబై నాలుగుసార్లు ఐపీఎల్ టైటిల్ గెలవడంలో, 2011లో ఛాంపియన్స్ లీగ్ టీ20 విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆటగాడిగా రిటైర్ అయ్యాక, 2018లో జట్టుకు మెంటార్‌గా సేవలందించాడు. తొమ్మిదేళ్ల పాటు బౌలింగ్ కోచ్‌గా ఉన్న షేన్ బాండ్ స్థానంలో, 2024 ఐపీఎల్ సీజన్‌కు ముందు ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా మలింగ తిరిగి జట్టులోకి వచ్చాడు. ఈ మధ్యలో రెండేళ్ల పాటు రాజస్థాన్ రాయల్స్ జట్టుకు కూడా కోచ్‌గా పనిచేశాడు. ఇక, టీమిండియా మాజీ పేసర్ పరాస్ మాంబ్రే రెండు విడతల్లో ముంబై ఇండియన్స్‌కు సేవలందించాడు. నవంబర్ 2021 నుంచి జులై 2024 వరకు భారత జట్టుకు బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించి, టీ20 ప్రపంచకప్ గెలిచిన జట్టులో భాగమయ్యాడు. ఇంగ్లండ్ మాజీ ఫీల్డింగ్ కోచ్ అయిన కార్ల్ హాప్‌కిన్‌సన్ 2025 సీజన్‌కు ముందు జట్టుతో కలిశాడు. ఈ సందర్భంగా ముంబై ఇండియన్స్ యాజమాన్యం ఒక ప్రకటన విడుదల చేసింది. "జట్టుకు, ముంబై ఇండియన్స్ కుటుంబానికి లసిత్, పరాస్, కార్ల్ అందించిన సేవలకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. వారి భవిష్యత్ ప్రయత్నాల్లో విజయం సాధించాలని కోరుకుంటున్నాం" అని పేర్కొంది. ఈ మార్పులతో ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్ సరికొత్త సహాయక బృందంతో బరిలోకి దిగేందుకు

'కల్ట్' రిలీజ్ ట్రైలర్.. రక్తపాతం, భయంకరమైన హత్యలతో విశ్వక్ సేన్ విశ్వరూపం!

జబర్శ్రీ । టాలీవుడ్ నటుడు విశ్వక్ సేన్ మరోసారి దర్శకుడిగా తన సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'కల్ట్' ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. భారతీయ సినిమాలో తొలి స్లాషర్ చిత్రంగా ప్రచారం పొందుతున్న ఈ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్ లభించింది. థియేటర్లలో విడుదలకు కొన్ని గంటల ముందు చిత్రబృందం రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేసింది. కత్తిపోట్లు, కోతలు, భయపెట్టే సన్నివేశాలతో నిండిన ఈ ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇప్పటికే విడుదలైన తొలి ట్రైలర్‌లో సినిమా నేపథ్యాన్ని పరిచయం చేస్తూ, ఓ పార్టీలో జరిగే హింసాత్మక ఘటనల గురించి చూపించారు. తాజాగా వచ్చిన రిలీజ్ ట్రైలర్‌లో మాత్రం విశ్వక్ సేన్ పోషించిన డీఎస్పీ సంకల్ప్ నాయక్ పాత్రకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. గోవాలో స్థానికులు స్థానికేతరులను, ముఖ్యంగా తెలుగు వారిని ఇబ్బందులకు గురిచేయడాన్ని సంకల్ప్ సహించడు. వారిని రక్షించాలనే ఉద్దేశంతో గోవాకు వెళ్లిన అతడి చుట్టూ కథ తిరుగుతుంది. ట్రైలర్ చివర్లో పార్టీలో అతడు సాగించే హత్యాకాండను చూపించారు. యాక్షన్‌తో పాటు స్లాషర్ తరహా సన్నివేశాలు ట్రైలర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సంకల్ప్ నాయక్ పాత్రలో విశ్వక్ సేన్ దూకుడు, క్రూరత్వం స్పష్టంగా కనిపిస్తున్నాయి. పాత్రకు తగ్గట్టుగా ఆయన ఆగ్రహభరితమైన నటన ఆకట్టుకుంటోంది. హింసాత్మక సన్నివేశాలను కూడా ప్రత్యేకమైన శైలిలో, కొంత కార్టూన్ తరహా రూపంలో తెరకెక్కించడంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఈ చిత్రంలో మురళీ శర్మ రాజకీయ నాయకుడిగా, శ్రీకాంత్ అయ్యంగార్ సీనియర్ పోలీసు అధికారిగా నటిస్తున్నారు. గాయత్రి భరద్వాజ్, తారక్ పొన్నప్ప తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తారక్ సినిమాస్ పతాకంపై సందీప్ కకరాల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతాన్ని అందించగా, తరుణ్ భాస్కర్ సంభాషణలు రాశారు. విడుదల ట్రైలర్‌లో కనిపిస్తున్న రక్తపాతం, వేగవంతమైన యాక్షన్ సన్నివేశాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. మరి 'కల్ట్' ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

అది సీక్వెల్ కాదు, అక్కడితోనే క్లోజ్.. ధనుష్ 'ఓం' సినిమాపై క్లారిటీ ఇచ్చిన డైరెక్టర్!

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'ఓం -- చాప్టర్ 1 'అమరన్' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత రాజ్ కుమార్ పెరియసామి తెరకెక్కిస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి దర్శకుడు రాజ్ కుమార్ పెరియసామి వెల్లడించిన ఆసక్తికరమైన విషయాలు సినిమాపై మరింత హైప్‌ను పెంచుతున్నాయి. 'ఓం' చాప్టర్ 1, చాప్టర్ 2 సినిమాల మధ్య ఎలాంటి సంబంధం లేదని దర్శకుడు స్పష్టం చేశారు. ఈ సినిమా టైటిల్‌లో 'చాప్టర్ 1' అని ఉన్నప్పటికీ, ఇది రెండు భాగాలుగా కొనసాగే సీక్వెల్ కాదని, మొదటి భాగంతోనే ఈ కథ పూర్తిగా ముగిసిపోతుందని ఆయన వెల్లడించారు. అలాగే తాము ఈ చిత్రాన్ని కేవలం ఒక భాషలో మాత్రమే కాకుండా, ద్విభాషా చిత్రంగా ప్లాన్ చేయనప్పటికీ.. తమిళ మరియు తెలుగు ప్రేక్షకులు ఇద్దరూ దీన్ని తమ సొంత స్ట్రెయిట్ సినిమా అనే అనుభూతిని పొందుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో నటీనటుల పాత్రలు అంత్యంత ప్రత్యేకంగా ఉంటాయని దర్శకుడు తెలిపారు. ముఖ్యంగా నేచురల్ బ్యూటీ సాయి పల్లవి (ఏఎస్పీ నిత్యా రెడ్డి పాత్రలో) మరియు టాలెంటెడ్ యంగ్ హీరోయిన్ శ్రీలీల ఇద్దరి పాత్రలు వారి ఇప్పటివరకు చేసిన సినిమాలకు, వారి కంఫర్ట్ జోన్‌కు పూర్తిగా భిన్నంగా, అవుట్ అండ్ అవుట్ కొత్తగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో ధనుష్‌తో పాటు మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, దిగ్గజ నటుడు నసీరుద్దీన్ షా వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వండర్‌బార్ ఫిలింస్ మరియు ఆర్‌టేక్ స్టూడియోస్ పతాకాలపై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. అన్ని హంగులను పూర్తి చేసుకుని ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 20న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

'ఆ సీన్లు నాకూ నచ్చలేదు'.. పెద్ది సినిమాపై జాన్వీ తీవ్ర వ్యాఖ్యలు!

టాలీవుడ్ హీరో రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'పెద్ది'. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన జాన్వీ కపూర్ పాత్రపై గతంలో పలు విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా సినిమాలో మహిళలను చూపించిన తీరుపై సోషల్ మీడియాలో చర్చ నడిచింది. ఈ నేపథ్యంలో జాన్వీ కపూర్ ఈ వివాదంపై స్పందించారు. తాజాగా 'కాఫీ విత్ కరణ్' షోలో మాట్లాడిన ఆమె.. సినిమాలో తన రోల్, మహిళలను చూపించిన విధానంపై వచ్చిన విమర్శలు నిజమేనని ఓపెన్‌గా ఒప్పేసుకున్నారు. 'పెద్ది మూవీ చిత్రీకరణ సమయంలోనే కొన్ని సన్నివేశాల విషయంలో అసౌకర్యంగా అనిపించింది. వాటిపై మరింత గట్టిగా నా అభిప్రాయాన్ని వ్యక్తం చేసి ఉండాల్సింది. కొన్ని సన్నివేశాల విషయంలో మరింత బలంగా మాట్లాడాల్సింది. కొన్ని సీన్లు నాకూ నచ్చలేదు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు మళ్లీమళ్లీ జరగకుండా చూసుకోవడమే నాకున్న ఏకైక మార్గం. దీని గురించి ఇప్పటివరకూ నేను స్పందించకపోవడానికి కారణం ఏంటంటే.. ఆ సినిమా కోసం చాలా మంది కష్టపడ్డారు. అందుకే మౌనంగా ఉన్నాను' అని తెలిపారు. పెద్ది థియేటర్లలో విడుదలైన తర్వాత జాన్వీ పాత్రపై, ముఖ్యంగా కొన్ని సన్నివేశాలపై ప్రేక్షకుల నుంచి అప్పట్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మహిళలను కొన్ని సీన్లలో చూపించే విధానంపై సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విమర్శలపై దర్శకుడు బుచ్చిబాబు సైతం గతంలో స్పందించారు. ఆ తర్వాత వెంటనే స్పందించి వివాదాస్పద సన్నివేశాలను సినిమా నుంచి తొలగించారు.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com